ప్రజాశక్తి
శుక్రవారం 24 జనవరి 2025 8 పేజీలు

గుంటూరు

పల్నాడు

మేయర్ పీఠంపై టిడిపి కన్ను

- వైసిపి కార్పొరేటర్లకు వల
- ఎమ్మెల్యే రామాంజనేయులు ఆధ్వర్యంలో చర్చలు
- ఒకేరోజు ఇద్దరు సానుకూలత

వైసిపి కార్పొరేటర్ రాజ్యలక్ష్మి కుటుంబసభ్యులతో ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంటూరు మేయర్ పీఠంపై టిడిపి దృష్టి సారించింది. తొలుత ఫిబ్రవరి 3వ తేదీన జరగనున్న స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించి ఆ తరువాత మార్చిలో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు టిడిపి నాయకులు వేగంగా పావులు కదుపుతున్నారు. కార్పొరేషన్‌లో స్టాడింగ్ కమిటీ ఎన్నికల కోసం ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు రంగంలోకి దిగారు. వైసిపికి చెందిన ఇద్దరు కార్పొరేటర్ల కుటుంబ సభ్యులను ఆయన గురువారం కలిసి చర్చించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు వీరి మద్దతు కూడగట్టారు. అంకిరెడ్డిపాలెం కార్పొరేటరు శ్యామల, నల్లపాడు కార్పొరేటర్లు చల్లా రాజ్యలక్ష్మి కుటుంబ పెద్దలతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. వీరితో పాటు అడవితక్కెళ్లపాడు కార్పొరేటరు స్విత పద్మజతో కలిసి ఆయన వైసిపి కార్పొరేటర్ల మామ, భర్తలను కలిసి టిడిపిలోకి ఆహ్వానించారు. తాము అవసరమైనప్పుడు మీకే మద్దతు ఇస్తామని చల్లా రాజ్యలక్ష్మి, శ్యామలా చెప్పినట్లు టిడిపి నాయకులు తెలిపారు. వీరిద్దరు ఎట్టి పరిస్థితులలో వైసిపిని వీడరని మేయర్ కావటి మనోహర్ నాయుడు తొలుత ధీమా వ్యక్తం చేశారు. అయితే కొద్దిసేపటికే వైసిపి కార్పొరేటర్లు కొంతమంది... వారిద్దరు టిడిపి వైపు వెళ్లనిట్లేనని మేయర్‌కు సమాచారం అందించారు. వెంటనే మేయర్ వైసిపి సీనియర్లకు సమాచారం అందించారు.

కార్పొరేషన్‌లో మొత్తం 57 మంది కార్పొరేటర్లుకు గాను ఒకరు మృతితో ఒక డివిజన్ ఖాళీగా ఉంది. ప్రస్తుతం 56 మందిలో తమకు 32 మంది ఉన్నారని వైసిపి వారు చెబుతున్నారు. 24 ▶ 2లో

నిధుల మళ్లింపుపై న్యాయపోరాటం

సొంత ఖాతాలకు జమచేసుకున్నారని కమిషనర్‌పై మేయర్ ధ్వజం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

బుడమేరు వరదల సమయంలో గుంటూరు కార్పొరేషన్ ద్వారా ఖర్చుపెట్టిన రూ.9.24 కోట్లకు సంబంధించిన వివరాలను ఇవ్వాలని మేయర్ కావటి మనోహర్ నాయుడు చేసిన సవాల్‌ను నగర పాలక సంస్థ అధికారులు పట్టించుకోలేదు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల మధ్య తాను తన కార్యాలయంలో ఉంటానిని ప్రకటించిన మేయర్ మూడు గంటలపాటు కార్యాలయంలో వేచి ఉన్నారు. అవినీతి జరగలేదని, నిక్కచ్చిగా డబ్బు ఖర్చు పెట్టినట్లు చెబుతున్న కమిషనర్ కౌన్సిల్‌కు వివరాలు ఇవ్వాలన్నారు. అయితే వివరాలు ఇవ్వకుండా గతంలోనే మేయర్‌కు ఫైల్ పంపామని కమిషనర్ చెప్పడం సబబు కాదన్నారు. వరద బాధితులకు ఖర్చుపెట్టాల్సిన నిధులను దారి మళ్లించినట్లు తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయన్నారు. సంబంధం లేని వ్యక్తులకు చెల్లింపులు చేశారని, వారు ఎక్కడి వారో తనకు తెలుసునని చెప్పారు. కార్పొరేషన్ నుంచి కమిషనర్ చేసిన చెల్లింపులలో కొంత భాగం తిరిగి కమిషనర్ వ్యక్తిగత ఖాతాలకు జమైనట్లు తన వద్ద వివరాలు ఉన్నాయని, త్వరలో నిరూపిస్తామని అన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తాము ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంలో న్యాయపోరాటం చేస్తామని, ప్రజా ఉద్యమం నిర్వహిస్తామని చెప్పారు. కౌన్సిల్ అనుమతి లేకుండా ఫిక్స్‌డ్ డిపాజిట్లును డ్రా చేశారని, ఈ సందర్భంగా పెద్ద మొత్తంలో నిధులు పక్కదారి పట్టాయని అన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న ఏపూరి గోపాలరావు తదితరులు

26న ట్రాక్టర్లు, బైక్‌లతో ర్యాలీలు

ప్రజాశక్తి - క్రోసూరులో

రైతులకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా రైతు సంఘాల సమన్వయ కమిటీ పిలుపు మేరకు 26న నిర్వహించే నిరసనలను జయప్రదం చేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక ఆమంచి విజ్ఞాన కేంద్రంలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. పల్నాడు జిల్లాలో ట్రాక్టర్ల, ద్విచక్ర వాహనాలతో ర్యాలీలు చేపడతామన్నారు. వ్యవసాయం మొత్తాన్ని కార్పొరేట్లకు అప్పచెప్ప డానికి కేంద్ర ప్రభుత్వం 2020లో తెచ్చిన నల్ల చట్టాల రద్దు కోసం ఢిల్లీలో 13 నెలలపాటు రైతులు పోరాటం చేశారని గుర్తు చేశారు. స్వామినాథన్ కమిషన్ ▶ 2లో

విమానాశ్రయం కోసం భూముల పరిశీలన

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున సాగర్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు కావాల్సిన భూములను న్యూఢిల్లీకి చెందిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని జాయింట్ జనరల్ మేనేజర్ ఎస్ఎస్ మూర్తి ఆధ్వర్యంలోని ఆరుగురు సభ్యుల బృందం గురువారం పరిశీలించింది. మాచర్ల మండలంలోని విజయపురిసౌత్, పసువేముల, చింతలతండా, నాగులవరం గ్రామాల్లోని ప్రతిపాదిన భూములను పరిశీలించి నివేదికను సిద్ధం చేసుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌కు కావాల్సిన సౌకర్యాలు, వాతావరణ పరిస్థితులను అంచనా వేశారు. బృందం వెంట గురజాల ఆర్డీవో వి.మురళీకృష్ణ, మాచర్ల తహశీల్దార్ బి.కిరణ్ కుమార్, ఆర్‌ఐ అనిల్ కుమార్, మండల సర్వేయర్ వై.రఘుపతి ఉన్నారు.

జెసికి వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

12వ పిఆర్‌సిని ఏర్పాటు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో 12వ పిఆర్‌సిని నియమించి ఐఆర్ 30 శాతం ఇవ్వాలని, ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే ఇవ్వాలని యుటిఎఫ్ కోరింది. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజకు నాయకులు గురువారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ 11వ పిఆర్‌సికి సంబంధించిన బకాయిలు రూ.7384 కోట్లు, డిఎ బకాయిలు రూ.9650 కోట్లు, సరెండర్ లీవ్ బకాయిలు రూ.2250 కోట్లు, సిపిఎస్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్ రూ.2500 కోట్లు, ఎపిజిఎల్ఐ బకాయిలు రూ.950 కోట్లు వెంటనే చెల్లించాలని కోరారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ▶ 2లో

తరగతుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులు

- గ్రీవెన్స్ ఫిర్యాదుల పరిష్కారం కోసం నోడల్ ఆఫీసర్
- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో తరగతుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల రేషనలైజేషన్ ఉంటుందని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 10వ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు 'లక్ష్య సాధన' కార్యక్రమం ద్వారా ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గత 6 నెలల్లో నిర్వహించిన కార్యక్రమాలు, రానున్న రోజుల్లో జిల్లా అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఇప్పటి వరకూ జిల్లా స్థాయిలో నిర్వహిస్తూ వచ్చిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఫిబ్రవరి 1 నుంచి నియోజక వర్గాల స్థాయిలో నిర్వహించనున్నామని ప్రకటించారు. ఒక సోమవారం జిల్లా స్థాయిలో మరో సోమవారం ఏదైనా నియోజకవర్గంలో నిర్వహిస్తామని చెప్పారు.

అవసరమైతే మండల స్థాయికి తీసుకువెళ్తామని, ఫిర్యాదుల పరిష్కారాలను పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో నోడల్ ఆఫీసర్‌ను నియమించామని తెలిపారు. ▶ 2లో

మేయర్ పీఠంపై టిడిపి కన్ను

(మొదటి పేజీ తరువాయి)

మంది టిడిపి, జనసేన కూటమిలో ఉన్నారు. 2020లో జరిగిన ఎన్నికల్లో టిడిపి నుంచి 8 మంది, జనసేన నుంచి ఇద్దరు గెలిచారు. ప్రమాణ స్వీకారం కూడా చేయకుండానే ఆరో డివిజన్ కార్పొరేటర్ పాదర్తి రమేష్‌గాంధీ కరోనాతో మృతి చెందారు. తరువాత గాంధీ ప్రాతినిధ్యం వహించిన ఆరో డివిజన్‌కు ఉప ఎన్నికలు జరగ్గా టిడిపి అభ్యర్థి పోతురాజు సమత గెలిచారు. తరువాత 9 మంది టిడిపిలోకి, నలుగురు జనసేనలోకి చేరారు. ప్రస్తుతం వైసిపిలో ఉన్న 33 మందిలో 15 మందికి టిడిపి వారు గాలం వేస్తున్నారు. తొలి దశలో గురువారం ఇద్దరిని తమ వైపునకు తిప్పుకొన్నారు. మరో 10 మంది వైసిపి నుంచి టిడిపిలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో వైసిపి కార్పొరేటర్లతో ఎమ్మెల్సీ అప్పిరెడ్డి గురువారం రాత్రి సమావేశమై తాజా పరిస్థితులు చర్చించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికలను ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై మల్లగుల్లాలు పడ్డారు. అయితే స్టాండింగ్ కమిటీ మొత్తాన్ని కైవసం చేసుకోవాలని టిడిపి వ్యూహరచన చేస్తోంది. స్టాండింగ్ కమిటీని కైవసం చేసుకున్న తరువాత మేయర్ స్థానంపై పార్టీ అధిష్టానం సూచన మేరకు దృష్టి పెడతామని పలువురు టిడిపి కార్పొరేటర్లు తెలిపారు. మార్చి 18 నాటికి ప్రస్తుత కౌన్సిల్ ఏర్పడి నాలుగేళ్ళు పూర్తవుతుంది. మేయర్ లేదా మునిసిపల్ ఛైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టాలంటే నాలుగేళ్ల తరువాతే పెట్టాలని నిబంధన ఉంది.

12వ పిఆర్‌సిని ఏర్పాటు చేయాలి : యుటిఎఫ్

(మొదటి పేజీ తరువాయి)

ఎం.హనుమంతరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వులు అనుసరించి 2004కు ముందు నోటిఫికేషన్ ఇచ్చి 2004 తరువాత నియామకం పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో జిల్లా కార్యదర్శులు సిహెచ్ ఆదినారాయణ, ఎం.గోవిందు, బి.ప్రసాదు ఉన్నారు.

తరగతుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులు

(మొదటి పేజీ తరువాయి)

రానున్న రోజుల్లో మండల ప్రత్యేకాధికారులతో పరిష్కారాలపై ఆడిట్ నిర్వహిస్తామన్నారు. గ్రీవెన్స్‌కు అర్జీలు రాయడంపై అవగాహన లేని వారి సౌకర్యార్థం కలెక్టరేట్‌లో అర్జీలు రాసేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆర్నెల్ల కాలంలో కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌కు 11,176 ఫిర్యాదులు అందగా 7258 పరిష్కారమయ్యాయని, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. రెవెన్యూ, పోలీసు, సర్వే, పంచాయతీరాజ్ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు ఎక్కువగా ఉంటున్నాయన్నారు.

26న ట్రాక్టర్లు, బైక్‌లతో ర్యాలీలు

(మొదటి పేజీ తరువాయి)

సిఫార్సుల మేరకు పంటలకు మద్దతు ధరల చట్టం చేయాలని, కేరళ తరహాలో రైతులకు రుణ విమోచన చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ కింద ఏడాదిలో 200 పనిదినాలు కల్పించాలని తదితర డిమాండ్లతో సుదీర్ఘ పోరాటం జరిగిందని, ఈ పోరాటంలో 720 మంది రైతులు చనిపోయారని తెలిపారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పలు హామీలిచ్చినా వాటిని అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, ఈ నేపథ్యంలో మరోసారి నిరసనలకు పిలుపునిచ్చామని చెప్పారు. వ్యవసాయంలో కీలకమైన కౌలురైతులను గ్రామ సభల ద్వారా గుర్తించి గుర్తింపు కార్డులతోపాటు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. ధాన్యం మొత్తాన్ని మద్దతు ధరకు కొంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నా రైతుల వద్ద ఇంకా ధాన్యం మిగిలే ఉందని తెలిపారు. ఎగుమతులకు అనుమతినిచ్చి మిర్చి పంటనూ కనీస మద్దతు ధరకు కొనాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.రవిబాబు, కౌలురైతు సంఘం నాయకులు టి.హనుమంతరావు, రైతు సంఘం నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఒత్తిడి, రుగ్మతలను రూపుమాపేందుకు బౌద్ధ ధ్యానం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మానసిక ఒత్తిడి, శారీరక రుగ్మతలు రూపుమాపేందుకు బౌద్ధ ధ్యానం దోహదపడుతుందని అమెరికాలోని కొలరాడో యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఫ్రైడే రిక్ లారెన్స్ కూలిడ్జ్ అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బౌద్ధ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'బౌద్ధం విజ్ఞాన శాస్త్రం కృత్రిమ మేధస్సు సవాళ్లు' అంశంపై రెండ్రోజుల జాతీయ సదస్సు గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి కీలక ఉపన్యాసకులుగా పాల్గొన్న ఫ్రెడరిక్ లారెన్స్ మాట్లాడుతూ బౌద్ధంలో సుఖదుఃఖాలు, మానవ సంబంధాలను ప్రేరేపించేలా ఉన్నాయన్నారు. ప్రపంచం కృత్రిమ మేధా వైపు వేగంగా అడుగులు వేస్తోందని, తద్వారా మానవుడు మానసిక రుగ్మతలకు గురి కాకుండా చూసుకోవలసిన అవసరం ఉందని చెప్పారు. సాంకేతికత ఆధారంగా ముందుకు సాగుతున్న నేటి తరుణంలో మానవుని మేధస్సుపై ఒత్తిడి లేకుండా చూసుకోవాలన్నారు. బెనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ భీమలేంద్ర కుమార్, ముంబై ఐఐటి నుంచి పాల్గొన్న ప్రొఫెసర్ సిడి సెబాస్టియన్, జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ ప్రొఫెసర్ స్మిత సర్కార్, జాదవ్ పూర్ యూనివర్సిటీ నుంచి పాల్గొన్న మేధా సిన్హా, ధన్‌బాద్‌లోని ఐఐటి నుంచి పాల్గొన్న డాక్టర్ గ్యాన్ ప్రకాష్ తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. ముఖ్యంగా బౌద్ధం నేర్పిన పాఠం నేటి ఆధునిక పరిస్థితులు వంటి అంశాలను వివరించారు. 14 పరిశోధన పత్రాలు సమర్పించినట్లు సదస్సు డైరెక్టర్, ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎల్.ఉదయకుమార్ తెలిపారు. ప్రొఫెసర్లు సిహెచ్. స్వరూపారాణి, జి.సీతారావమ్మ, డాక్టర్ వి.దిలీప్ కుమార్, డాక్టర్ ఆర్.శేషగిరిరావు, విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ ఎం.వి.రాంకుమార్ రత్నం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఫ్రైడే రిక్ లారెన్స్ కూలిడ్జ్

రాజ్యలక్ష్మికి తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణానికి చెందిన టిడిపి రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి కనుమూరి రాజ్యలక్ష్మి అలియాస్ గద్దె అనంతలక్ష్మి తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని విజయవాడలోని శ్రీ కవిత పూర్ణానంద వికాస్ కళావేదికలో గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా మెను సత్కరించారు. రాజ్యలక్ష్మి గతంలో డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జాతీయ అవార్డు అందుకున్నారు. ఎపికెఎస్ఎస్ రాష్ట్ర కార్యదర్శి, ప్రధానోపాధ్యాయిని, అధ్యాపకురాలు, సాహితీవేత్త, కవయిత్రి, సామాజిక సేవకురాలుగా, తెలుగు సంస్కృతి సంప్రదాయాలు, కళలు సాహిత్యరంగ అభివృద్ధి పరిరక్షణలో భాగంగానే కాకుండా సామాజిక, విద్య, ఇతర సేవా రంగాల్లో కృషికి గుర్తింపుగా ఎన్నో అవార్డులు అందుకున్నారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో భోయిభీమన్న సాహిత్యనిధి ఛైర్ పర్సన్ బోయి హైమవతి, ఎపిఎస్ కమాండెడ్ డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి, మరియు శ్రీశ్రీ కళా వేదిక సీఈఓ

డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నుండి తాజాగా తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారాన్ని రాజ్యలక్ష్మి అందుకున్నారు. ఆమెను సంస్థ నిర్వాహకులతో పాటు ఎంపి లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టిడిపి నాయకులు అభినందించారు. అవార్డు రావడం తాను చేస్తున్న కార్యక్రమాల పట్ల, సమాజం పట్ల మరింత బాధ్యత పెంచిందని రాజ్యలక్ష్మి అన్నారు.

నిర్మలా ఫార్మసీలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నిర్మల ఫార్మసీ కళాశాలలో 'యాన్ ఇంటర్నేషనల్ సింపోసిఎం ఆన్ సస్టైనబుల్ డ్రగ్ డిజైన్ అండ్ నానో పార్టికల్ డెవలప్మెంట్ - క్వాంటం అండ్ కాంపుటేషనల్ పర్స్పెక్టివ్స్' అంశంపై రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సు గురువారం ముగిసింది. రెండోరోజు ముఖ్య వక్తలుగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి నుండి ప్రొఫెసర్ ఆర్.నాగరాజు, సిఎస్ఐఆర్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ హైదరాబాదు నుండి సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ బి.శ్రీనివాసరెడ్డి, ఎస్ఎఆర్ఎస్ కో-ఆర్డినేటర్ యూఎస్ఎ నుండి ప్రొఫెసర్ పి.శ్రీనివాస్, దత్త మేఘ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ మహారాష్ట్ర నుండి డాక్టర్ జితేంద్ర పటేల్, ఆన్‌లైన్‌లో సెర్బియా దేశం నుండి డాక్టర్ నేభోజస పవలోవిక్, ఐర్లాండ్ దేశం నుండి సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.రాఘవేంద్ర అశోక్, అస్సాం డౌన్ టౌన్ యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్ పి.ఉత్తమ్ ప్రసాద్ పాల్గొని ఫార్మసీ రంగంలోని వివిధ ఆవిష్కరణలను, అధునాతక అంశాలపై విద్యార్థులకు, అధ్యాపకులకు వివరించారు. రెండ్రోజులుగా నిర్వహించిన పరిశోధన పత్రాల ప్రదర్శన, విశ్లేషణ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం అతిథులను సన్మానించారు. రెండవ రోజు సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎస్ఎస్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణ, రాష్ట్రంలోని వివిధ కళాశాలల ప్రముఖులు డాక్టర్ వి.సతీష్ కుమార్, డాక్టర్ వై.రత్నసింధు, డాక్టర్ కె.ప్రవళిక, డాక్టర్ సిహెచ్ సుప్రియ, డాక్టర్ సూర్యప్రభ, డాక్టర్ హేమకుమారి, డాక్టర్ విజయ్ కిషోర్, డాక్టర్ పూర్ణిమ, డాక్టర్ హరింధాం, నిర్మల ఫార్మసీ కళాశాల ప్రెసిడెంట్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ యు.శౌరీలు, కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ జి.నిర్మల జ్యోతి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పాములరెడ్డి, నిర్మల పాఠశాల సంస్థల కరస్పాండెంట్ రెవరెండ్ సిస్టర్ జాన్‌పాల్, రెవరెండ్ సిస్టర్ అఫతా, ప్రోగ్రాం ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ హరేకృష్ణరాయ పాల్గొన్నారు.

సౌత్ సెంట్రల్ రైల్వే న్యాయ సలహాదారుగా శేషగిరిరావు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

దక్షిణ మధ్య రైల్వే న్యాయ సలహాదారుగా హైకోర్టు న్యాయవాది ఉల్లం శేషగిరిరావు నియమితులయ్యారు. ఈ మేరకు న్యాయశాఖ సికింద్రాబాదు న్యాయధికారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కృషి చేసిన కమతం కాశిరెడ్డి, పాపిరెడ్డికి శేషగిరిరావు కృతజ్ఞతలు తెలిపారు ఆయనకు న్యాయవాది దివ్వెల, శ్రీనివాసరావు, ఎజిపి బి.నరసింహారావు, సీనియర్ న్యాయవాది పిన్నమనేని పాములయ్య శుభాకాంక్షలు తెలిపారు.

తిరునాళ్ల ఏర్పాట్లకు నిధులివ్వండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : దేవాదాయ - ధర్మదాయశాఖ మంత్రి అనం రామనారాయణరెడ్డిని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం కలిశారు. కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వరస్వామి జ్ఞాపికను, ప్రసాదాలను మంత్రికి అందజేశారు. మహా శివరాత్రిని సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవం గురించి, జరగనున్న అభివృద్ధి కార్యక్రమాలను మంత్రికి వివరించారు. తిరునాళ్ల ఏర్పాట్లకు కావాల్సిన నిధులను మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట కోటప్పకొండ ఆలయ ఈఓ చంద్రశేఖర్, టిడిపి నాయకులు బి.విశ్వేశ్వరరావు, జి.సుబ్రహ్మణ్యం, ఎ.సుబ్బారావు ఉన్నారు.

ఎంవి రెడ్డి ఐ హాస్పిటల్ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట ఎంవి రెడ్డి 'ఐ' హాస్పిటల్ ఆధ్వర్యంలో నరసరావుపేట మండల న్యాయ సేవాధికార సంస్థ సౌజన్యంతో పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని నరసరావుపేట 13వ అదనపు జిల్లా జడ్జి ఎన్.సత్య ప్రారంభించగా 165 మందికి పైగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. జడ్జి సత్యశ్రీ మాట్లాడుతూ చిన్నారులు, పెద్దలు టివి, సెల్ ఫోన్, కంప్యూటర్‌లతో సమయం గడుపుతూ చిన్న వయసులోనే కంటి సంబంధిత వ్యాధులకు గురవుతున్నారని అన్నారు. శరీరంలో అతి సున్నితభాగమైన కంటి వ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. ఎంవి రెడ్డి హాస్పిటల్ అధినేత డాక్టర్ ముద్దం వివేకానందరెడ్డి, డాక్టర్ ఎల్.సృజన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ గుడ్డు, తాజా ఆకుకూరలు, ఆహారం తీసుకోవడంతో పాటు సమయానికి నిద్ర పోవడం ద్వారా కంటి సంబంధిత వ్యాధులకు దూరంగా ఉండొచ్చన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎపివి ఇందిరా, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ఐగ్రో విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రోడ్డు భద్రతలపై విద్యార్థి దశ నుండే అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని నరసరావుపేట ట్రాఫిక్ సిఐ లోకనాథం అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రోడ్ సేఫ్టీ ఎన్జిఓ ఆధ్వర్యంలో ఆర్టీవో ఆఫీసు పక్కన గల రోడ్ సేఫ్టీ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ సెంటర్‌లో ఐ.గ్రో ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలు - నివారణ అంశంపై అవగాహన కల్పించారు. రోడ్ సైన్ బోర్డుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ లోకనాథం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగడానికి ప్రధాన కారణం రోడ్డు భద్రతా నియమాలను పాటించకపోవడమేనన్నారు. అనంతరం విద్యార్థులతో రహదారి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ట్రాఫిక్ ఎస్ఐ వేణు, ఆర్టీవో శివనాగేశ్వరరావు, ఎన్జీవో ప్రెసిడెంట్ ఆర్.కె దుర్గాప్రద్మజ, ఎన్జీవో సభ్యులు కోటేశ్వరరావు, బంగారయ్య, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రబాబు పాల్గొన్నారు.

ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి

ప్రజాశక్తి - గుంటూరు

సుభాష్ చంద్రబోస్ జయంతిని చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్థానిక భారత్‌పేటలోని మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి స్పేస్ క్లబ్ వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా సంగిరెడ్డి హనుమంతరెడ్డి హాజరై మాట్లాడారు. సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ ఫౌజ్ స్థాపించి దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాడారని చెప్పారు. ఆయనలోని పట్టుదల, కార్యదక్షతను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాద్‌పాల్గొన్నారు.

స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సభకు రంగరాజు అధ్యక్షత వహించగా ఆయనతోపాటు గౌరవ అధ్యక్షులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి, మధుసూదనరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం మాట్లాడారు. ఫార్మా.డి. డైరెక్టర్ డాక్టర్ పి.సీతారామయ్య, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.ప్రత్యూష, రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.గోవిందరాజన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

స్వాతంత్ర సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి ఉత్సవాలను గురువారం మండల కేంద్రం దుగ్గిరాలలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రైలు పేటలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో గూడూరు వెంకటరావు గద్దె శ్రీనివాస్ బుస ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పెదనందిపాడు

భారత స్వాతంత్ర్య పోరాట వీరుడిగా, నాయకుడుగా, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడుగా, భారత జాతీయ సైన్యాధినేతగా భారత స్వాతంత్రం కోసం సుభాష్ చంద్రబోస్ పోరాటం చేసిన తీరు స్ఫూర్తిదాయకమని ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు గేరా మోహనరావు పేర్కొన్నారు. భారతదేశ స్వాతంత్రం కోసం పోరాడిన గొప్ప వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని, ఆయన ప్రజలందరి హృదయాల్లో చిరస్మరణీయులుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగా పెదనందిపాడు, శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ నిర్వహకురాలు పి సుభాషిని ఆధ్వర్యంలో నిర్వహించిన సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు మహాత్మా గాంధీ మొదలైన నాయకులు అహింసావాదం తోనే స్వరాజ్యం సిద్ధిస్తుందని నమ్మి పోరాటం సాగిస్తుంటే, సుభాష్ చంద్రబోస్ మాత్రం సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టవచ్చునని నమ్మి అది ఆచరణలో పెట్టి స్వాతంత్రం కోసం నిరంతరం పోరాడిన గొప్ప వ్యక్తి నేతాజీ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు గొరపాటి రమేష్,బొరుగడ్డ శాంసన్,గుగ్గిలం సాయిబాబు, ఏ సురేష్, ఆనందరావు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ నరసరావుపేట ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో..

E.P 160/2023, O.S No: 2/2020

గొంటు లింగారెడ్డి .... డిక్రీ హోల్డరు/వాది

మరియు

1) వాసవి ఫర్టిలైజర్స్ నరసరావుపేట, రిః బై, ఇట్స్ ప్రొప్రయిటర్ : కనమర్లపూడి చంద్రశేఖర్,

2) కనమర్లపూడి చంద్రశేఖర్ S/o కృష్ణమూర్తి, హిందువు, వయసు 50 ఏళ్ళు, వ్యాపారం, R/D No: 193, వీధి నెం. 340, భరంపేట, నరసరావుపేట పోస్ట్, మండలం, పల్నాడు జిల్లా.

..... జడ్జిమెంట్ డెటర్స్/ప్రతివాదులు

పైన తెలిపిన అమలు పిటిషను లో ఇందలి డిక్రీ హోల్డర్, ఇందలి జడ్జిమెంట్ డెటర్స్‌కు ఎన్ని పర్యాయములు వేలము నోటీసులు పంపియున్నను తీసుకోనందున ఈ పేపర్ ప్రకటన ద్వారా తెలియ జేయడమైనది. వాయిదా ది. 7-02-2025 న అయి ఉన్నది. సదరు వాయిదా రోజున ఉదయం 10:30 ని.లకు మీరు స్వయంగా కానీ లేక మీ న్యాయవాది ద్వారా కానీ హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల మీ పరోక్షమందు తీర్మానం చేయబడునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా ది.7-02-2025

ఇట్లు.

ముత్తవరపు శ్రీనివాసరావు,

అడ్వకేట్, నరసరావుపేట- 522601

సెల్ నెం.9603037801

వేలం ప్రకటన

మహారాజశ్రీ తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టు

ఇ.పి. 131/2023 ఇన్ ఓ.యస్.నెం. 439/2021

బిట్వీన్ :

Tamma Ramalinga Reddy .... DHR

And

Tamma Srinivasa Reddy .... JDR

పై నెంబరు ఇ.పి.లో ఈ దిగువ షెడ్యూలు దాఖలా జెడిఆర్ యొక్క స్థిరాస్తిని పై కోర్టువారిచే ది. 11-2-2025వ తేదీ ఉదయం 10-30 గం.ల లగాయతు వేలం వేయబడును. కావలసిన వారు వేలంపాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

SCHEDULE

Guntur District, Tsunduru Mandal, Valiveru Village D.No. 259/3, Ac. 0.75 Cents, D.No. 259/4 Ac. 1-00 Cents Total Ac. 1.75 of wet land bounded by :

East : Irrigation Channal

South : Emani Nagireddy Property

West : Chidepudi Srinivasa Reddy Property

North : Irrigation Channel.

with in those boundaries an extent of Ac. 1.75 cents of wet land

DHr Value Rs. 10,00,000/-

Amina Value : Rs. 43,75,000/-

సేల్‌డేట్ : 11-2-2025

ఫరదర్ హియరింగ్ : 18-2-2025

ఇ.పి. దాఖలా అన్యాక్రాంతములు లేవు.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

శ్రీ గడ్డిపాటి రాంబాబు,

డిహెచ్ఆర్ తరపు అడ్వకేటు,

తెనాలి. సెల్ : 9490224350

మహారాజశ్రీ గౌరవ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో బాపట్ల

I.A.No.875/2023 In HMOP No.71/2018

బిట్వీన్ :

దేవిరెడ్డి విజయలక్ష్మి .....పిటీషనర్/రెస్పాండెంట్

మరియు

దేవిరెడ్డి భాగ్యరాజు .... రెస్పాండెంట్/పిటీషనర్

టు:

దేవిరెడ్డి భాగ్యరాజు, తండ్రి: వెంకట అప్పారావు, హిందువు, వయస్సు: 35 సం॥లు, నివాసం: డోర్ నెం.2-179రు, పాండ్రపాడు గ్రామము, కాకుమాను మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు పిటీషన్ ను పిటీషనర్/రెస్పాండెంట్ కోర్టు వారు ది.20.10.2023వ తేదీన జారీ కాబడిన డిక్రీని రద్దు పరిపించమని కోరుతూ దాఖలు చేసి యున్నారు. సదరు పిటీషన్ నందు మీ యొక్క హాజరు నిమిత్తం మీకు ఎన్నిపర్యాయములు కోర్టు నోటీసులు పంపినను మీరు ఉద్దేశపూర్వకముగా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున, శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు ఇవ్వడం జరిగినది. కావున మీరు ది. 5.2.2025 వ తేదీ ఉదయం గం. 10-30 ని॥లకు పై కోర్టు వారి యెదుట మీరు స్వయముగా గాని, మీ అడ్వకేటు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియచేసుకొనవలసియున్నది. లేనిచో మీ పరోక్షమున పై దావాను తీర్మానం చేయబడునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము //

వాయిదా తేది: 05.02.2025

ఇట్లు

దొడ్డక బ్రహ్మానందరావు,

చిలకా శ్రీధర్,

న్యాయవాదులు,

డోర్ నెం.5-20 బి, గవర్నమెంటు హాస్పిటల్ దగ్గర, ద్వారకానగర్, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.

సెల్: 9848070567

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, పెదకాకాని మండలం, అగతవరప్పాడు గ్రామ కాపురస్తులు నీలం జయరామ్ గారి కుమారుడు నీలం సతీష్ కుమార్ గారి సూచనల మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా,నా క్లయింటు పేరిటకు మరియు వారి సోదరులు, సోదరీమణులు మొత్తం అయిదుగురి పేరిటకు ది.02-06-2014న గుంటూరు జిల్లా రిజిస్ట్రార్ వారి కార్యాలయంలో జాయింటుగా రిజిష్టరు కాబడిన దఖలు దస్తావేజు నెం. 6202/ 2014 నకు లింకు దస్తావేజు అయిన ద.నెం.886/1953, తేది: 02-03-1953 ఒరిజినల్ ఒక కవరులో పెట్టుకుని నా క్లయింటు ది.02-01-2025న వ్యక్తిగత పనుల నిమిత్తం గుంటూరు సిటీ, అరండల్ పేట ఏరియాకు వచ్చి, అంతట సదరు దస్తావేజులు జిరాక్సు అవసరమై అరండల్ పేట 9/1వ లైనులోని జంబో జిరాక్సు సెంటర్ కు వెళ్లి జిరాక్సు తీయించుకుని వస్తుండగా పైన పేర్కొన్న లింకు దస్తావేజు నెం.886/1953 ఒరిజినల్ పోయినది. సదరు లింకు దస్తావేజు కోసం నా క్లయింటు ఎంత వెతికిననూ, అక్కడి పలువురిని విచారించినను దొరియుండలేదు.కావున సదరు ఒరిజినల్ లింకు ద.నెం.886/1953 ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింటుకు గాని, నాకు గాని అందజేయగలరు.అట్లుకాక సదరు దస్తావేజును ఎవరికైనా దుర్వినియోగపరిచిన యెడల నా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరని తెలియజేయడమైనది.

భీమిరెడ్డి శ్రీనివాస రెడ్డి, అడ్వకేట్,

నంబూరు, పెదకాకాని (మం),

గుంటూరు జిల్లా.

సెల్:99660 59981

మహారాజశ్రీ నరసరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

ఐ.ఎ.నెం.552/2022 ఓ.యస్.నెం.409/2015

బిట్వీన్ :

పేరుబోయిన లూర్దమ్మ మరియు ఇతరులు

..... పిటీషనర్/వాది

వర్సెస్

పేరుబోయిన సింగరయ్య @ నరసింహారావు మరియు ఇతరులు ....రెస్పాండెంట్సు/ ప్రతివాదులు

ఆర్-6 తల్లపనేని నాగేశ్వరరావు, తండ్రి మస్తాన్, అన్నవరం గ్రామము, రొంపిచర్ల మండలం, పల్నాడు జిల్లా.

పై నెంబరు వాజ్యంలో వాది మీపై ఇందలి పిటీషన్ను/దావాను దాఖలు చేయగా శ్రీ కోర్టువారు ఎన్ని పర్యాయములు కోర్టు ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా ఇందలి 6వ ప్రతివాది అయిన మీకు నోటీసులు పంపిననూ తీసుకోనక కాలయాపన చేయుచున్నందున పై తెలిపిన శ్రీ కోర్టువారు ఇందలి ప్రతివాదికి ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసును ఆర్డరు వేసి యున్నారు. కావున 6వ ప్రతివాది హాజరు నిమిత్తం ది.03-02-2025న వాయిదా వేసియున్నారు. ఆ రోజున మీరు గాని మీ వకీలు ద్వారాగాని పై కోర్టు వారి ఎదుట ఉ॥ 10.30 గం.లకు హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఈ యొక్క ప్రకటన/ నోటీసు ద్వారా తెలియజేయు నిమిత్తం ఇందుమూలము గా తెలియ జేయడమైనది.

వాయిదా : ది.03-02-2025

శ్రీకోర్టువారి ఉత్తర్వుల మేరకు ఈ ప్రకటన వేయడమైనది.

జి.వి.సుబ్రహ్మణ్యం,

యస్.వి. నాగరాజు,

న్యాయవాదులు

అరండల్ పేట, నరసరావుపేట.

దాక్యుమెంట్లు పోయినవి

పల్నాడు జిల్లా, నరసరావుపేట పట్టణం,అరండల్ పేట, మహాలక్ష్మి చెట్టు ప్రాంతానికి చెందిన బెల్లంకొండ అనిల్ S/o శ్రీనివాసరావు అను నేను యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై అడ్రస్ లోని ఇంటికి చెందిన జనరల్ పవరాఫ్ అటార్నీ దస్తావేజు నెం. 27253/2024 గల దాక్యుమెంటు, మరియు కొన్ని విలువైన పత్రాలతో ద్విచక్ర వాహనంపై అరండల్ పేట లోని జిరాక్స్ సెంటర్ కు వెళుతుండగా మార్గం మధ్యలో ఎక్కడో పడిపోయినవి.ఎంత వెదికినను దొరకలేదు. సదరు దాక్యుమెంటు ఎవరికైనా దొరికిన యెడల పై అడ్రస్ లేదా నెం. 91777 77207 నందు సంప్రదించగలరు. అట్లు కాకుండా సదరు దాక్యుమెంట్ ఎవరికైనా దొరికి వాటిని దుర్వినియోగ పరిస్తే చట్టపరంగా నేను తీసుకొను చర్యలకు బాధ్యులగుదురు. సదరు దాక్యుమెంట్ ఏ బ్యాంక్ నందు కానీ, ప్రైవేటు వ్యక్తుల వద్ద తాకట్టు పెట్టడం కానీ చేయలేదు.

IN THE COURT OF THE MVACT CUM XXV ADDL CHIEF JUDGE CITY CIVIL COURT AT HYDERABAD

MV.O.P No. 119 OF 2024

BETWEEN:-

N.Srilatha and others

...**Petitioners**

And

Sri Rama Sai Kumar & others

...**Respondents**

To,

R-1. Sri Rama Sai Kumar S/o, Chinna Narasimha Rao, Aged major, Occ: Owner of Crime vehicle, R/o, 12-91, Patimeeda, Vusa Subbaiah Street, Chilakaluripet, Guntur-522616.

R-3. S CH Narasimha Rao S/o, Venkateswarlu, Aged major, Occ: Rider of bike, R/o, 12-91, Patimeeda, Vusa Subbaiah Street, Chilakaluripet, Guntur-522616.

Please take notice that petitioners filed the above case against you and others for compensation under Sec. 166 of M.V Act for the death of N.Somaiah in a road accident on 20-12-23 at about 19.00 Hours and the above case is posted on 29-1-2025 at 10:30 AM for your appearance and counter. If you fail to appear before Hon'ble Court on specified date and time either in person or through an advocate else the case will be decided exparte.

(BY ORDER OF THE COURT)

P.SUDHEER

A.V.APPA RAO

S.DHEERAJ KUMAR

Advocates

H.No.16-2-145/8/3, Malakpet, Hyderabad-500036.

ఆటోను ఢీ కొట్టిన ద్విచక్ర వాహనం

పాఠశాల విద్యార్థులకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని శ్రీశైలం రోడ్డు లోని విశ్వబ్రాహ్మణ కాలనీ సమీపంలో స్కూల్ పిల్లలతో వస్తున్న ఆటోను వేగంగా వస్తున్న బైక్ ఢీకొనడంతో నలుగురు పిల్లలు గాయాలయ్యాయి. ద్విచక్ర వాహన దారుడు కూడా గాయాల పాలయ్యాడు. స్థానిక సెయింట్ ఆన్స్ ప్రాథమిక పాఠశాల (చిన్న కాన్వెంట్) సాయంత్రం స్కూల్ పూర్తయిన సమయంలో పిల్లలను ఇంటి దగ్గర వదిలేందుకు వెళుతున్న ఆటోను ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో నలుగురు పిల్లల గాయాలయ్యాయి. ఆటోలో మొత్తం ఎనిమిది మంది పిల్లలు ఉండగా ఇద్దరిని ఇంటి వద్ద దించి మిగిలిన వారిని వేరే ప్రాంతంలో దించేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. తంగెడ నుంచి ద్విచక్ర వాహనంపై ఎర్రగొండపాలెంకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న జి. ఆంజనేయులు ఆటోను వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆంజనేయులు మద్యం మత్తులో ఉన్నట్లుగా తెలిసింది. గాయాల పాలైన విద్యార్థులను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఇండ్లకు పంపించారు. ఆంజనేయులు కూడా ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

IN THE COURT OF THE MVACT CUM XI ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD

O.P.No. 2650 OF 2023

Between:

B. Balasundaram ... Petitioner

A N D

M. Priyanka & Others

...Respondents

To,

1. G. Ramesh, S/o. Mohan Rao, Aged 33 Years, Occ: Driver, R/o. 7-4B, Guttavaripalem, Batiprolu, Guntur District-522257.

Please take notice that the above petitioner had filed the case for grant of compensation for the injuries sustained of by name Busi Bala Sundaram, in a motor vehicle accident which occurred on 17-09-2023 under the limits of **P.S. Bantumilli.**

The above case is posted to **27-02-2025 at 10.30 AM** for your appearance and counter. If you fail to appear before this Hon'ble Court on specified date and time either in person or through an Advocate, else the case will be decided exparte.

[BY ORDER OF THE COURT]

Sd/- K. ANAND REDDY,

D. VENKAT RAMANA, Advocates

COUNSELS FOR THE PETITIONER

Off: Flat No. 212, Jamuna Towers, Opp: Yashoda Hospital, Malakpet, Hyderabad-500036.

Cell: 9848052455, 9848051707

యువకుడు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - వినుకొండ

బీర్‌లో పురుగు మందు కలుపుకొని తాగి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి వినుకొండలో జరిగింది. పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులోని ఓ లాడ్జిలో రాయల్ గోపి అనే యువకుడు రూమ్ అద్దెకు తీసుకొని బీర్ లో పురుగు మందు కలుపుకొని సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. సమాచారం తెలుసుకున్న తన స్నేహితులు రాయల్ గోపిని పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరుకు తరలించినట్లు తెలిపారు. నరసరావుపేటకు చెందిన రాయల్ గోపి చిలకలూరిపేట చెందిన మహిళతో వివాహం జరిగిందని, కుటుంబ కలహాలు నేపథ్యంలో సంక్రాంతి పండుగ ముందు భార్య చిలకలూ రిపేట పుట్టింటికి వెళ్లి అక్కడ ఎలుకల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడి నాలుగు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మధ్యాహ్నం మృతి చెందింది. భార్య మృతిని జీర్ణించుకోలేని రాయల్ గోపి వినుకొండకు వచ్చి ఏనుగుపాలెం రోడ్డులోని లాడ్జిలో రూమ్ తీసుకొని బీర్ లో పురుగుమందు కలుపుకొని తాగి వినుకొండ పట్టణంలోని తన స్నేహితులకి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో హాస్పిటల్ తరలించినట్లు తెలిసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ అధికారులు శంకరగిరి మాన్యాలకే

పంచాయతీరాజ్ అధికారులతో చీఫ్‌విప్ జీవీ సమీక్ష

ప్రజాశక్తి - వినుకొండ

ప్రజా సమస్యలపై అలసత్వం, విధులు, నిధుల పట్ల జవాబుదారీతనం లేని అధికారులు శంకరగిరి మాన్యాలు పడతారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు హెచ్చరించారు. పంచాయతీ నిధుల్ని అభివృద్ధి కార్యక్రమాలకే వెచ్చించాలని, ప్రతి రూపాయికీ లెక్క ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. వినుకొండలోని తన కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో ఆయన గురువారం సమీక్షించారు. పల్లెల్లోని ప్రతి వీధిలో దీపాలు వెలగాలని, స్వచ్ఛత, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. కొత్త ఆర్థిక సంవత్సరం నుంచి రాష్ట్రంలో ప్రతి పంచాయతీకో కార్యదర్శిని నియమించే విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకురానుందన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న 2, 3 పంచాయతీలకో కార్యదర్శి ఉండే క్లస్టర్ విధానం రద్దు కానుందని, పనిభారం తగ్గుతుందని చెప్పారు.

సబ్ జైలును సందర్శించిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి సబ్ జైలును గుంటూరు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి గుంటూరు లీలావతి గురువారం తనిఖీ చేశారు. సబ్ జైలు పరిసరాలను, ఆహార పదార్థాలను, వంటశాలను, స్నానపు గదులను పరిశీలించారు. రిమాండ్ ఖైదీల వివరాలపై జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నంతో మాట్లాడి రికార్డులను తనిఖీ చేశారు. ఖైదీలతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు గురించి తెలుసుకున్నారు. చట్టప్రకారం ఉన్న హక్కులను వివరించి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ న్యాయవాది బి.ఎల్.కోటేశ్వరరావు, పారా లీగల్ వాలంటీర్ షేక్ సుభాని పాల్గొన్నారు.

ఈపూరు మత్స్యకార సహకార సంఘం అధ్యక్షునిగా ఆత్మకూరి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఈపూరు

స్థానిక రాపర్ల వారి చెరువు మత్స్యకార సహకార సంఘం ఎన్నికలు పిఎసిఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడిగా ఆత్మకూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా చాపల సీతయ్య, కార్యదర్శులుగా ముద్దా సుబ్బారావు, మద్దం తాతయ్య, గంటా నరసయ్య, లక్కా పెద్ద ఆంజనేయులు, గంటా యలమంద, గంజనబోయి సీతారామయ్య, నాశన అచ్చయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన పాలకవర్గ సభ్యులు ఐదేళ్లపాటు పదవిలో కొనసాగనున్నారు. ఎన్నికల అధికారిగా మాచర్ల మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు వ్యవహరించగా మత్స్యశాఖ అభివృద్ధి అధికారి భాగ్యలత పర్యవేక్షించారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు

- వచ్చే విద్యాసంవత్సరం నుండి తరగతుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల నియామకం
- న్యాయమైన పింఛను ఇవ్వడానికే తనిఖీలు
- పర్యాటక రంగం అభివృద్ధికి కృషి
- పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి- పల్నాడు జిల్లా

ఆదివారం జరిగే గణతంత్ర దినోత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లుండాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. ఈ మేరకు నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో గురువారం సమీక్షించారు. కలెక్టరేట్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వేడుకల్లో లోటుపాట్లు తలెత్తనీయొద్దన్నారు. ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, జిల్లా అధికారులు, ప్రజల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను ఏర్పాటు చేయాలన్నారు. పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, శకటాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు ఉండాలన్నారు. వేడుకల్లో పాల్గొన్న వారికి తాగునీటి సరఫరా చేయాలని, స్నాక్స్ అందించాలని, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్, డిఆర్‌ఒ మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వచ్చే ఏడాది ఉపాధ్యాయుల రేషనలైజేషన్

ఇప్పటి వరకూ విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించే విధానానికి బదులుగా పాఠశాలలో ఉన్న తరగతుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయించే విధానాన్ని రానున్న విద్యా సంవత్సరంలో అవలంభించనున్నామని కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒకటి, రెండు తరగతులకు, ఆపైన తరగతులకు వేర్వేరుగా టీచర్లను నియమిస్తామని, ఉపాధ్యాయుల రేషనలైజేషన్ లో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య ఏ మాత్రం తగ్గబోదని చెప్పారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు 'లక్ష్య సాధన' పేరుతో విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తామన్నారు.

అర్హులకే పింఛనిచ్చేందుకు తనిఖీలు

జిల్లాలో వివిధ ఆరోగ్య సమస్యల వల్ల పూర్తిగా మంచానికి పరిమితమైన వారికి అందించే రూ.15 వేల పింఛను అర్హులకు మాత్రమే అందించేందుకు తనిఖీలు చేస్తున్నామేగాని తొలగించడానికి కాదన్నారు. అర్హతకు మించి ఎక్కువ పింఛను పొందేవారికి న్యాయంగా రావాల్సిన పింఛనే అందిస్తామన్నారు. జిల్లాలో ప్రతినెలా మొదటి రోజే 99.4 శాతం పింఛన్లు ఇంటివద్దే మంజూరు చేస్తున్నామని, మూడు నెలలకోసారి ఫించన్ తీసుకునే అవకాశం ఉండటం వల్ల వందశాతం మందికి ఇవ్వలేకపోతున్నట్లు తెలిపారు.

తప్పులను సరిచేస్తూ రీసర్వే

ప్రభుత్వ భూముల రీ సర్వే కొనసాగుతోందని, ముందుగా ప్రతి గ్రామంలో సరిహద్దులను నిర్ణయించి అనంతరం పూర్తి స్థాయిలో ప్రైవేటు భూముల సర్వే చేపడతామని అన్నారు. గతంలో జరిగిన తప్పులను పరిష్కరిస్తూ ముందుకువెళ్తామన్నారు. చిన్నపిల్లల కోసం ఆధార్ ఎన్రోల్మెంట్ కోసం అంగన్‌వాడీ స్థాయిలోనే ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. మంగళవారం నుంచి శుక్రవారం వరకూ నిర్వహించే ఈ కార్యక్రమం వచ్చే వారం కూడా కొనసాగనుందన్నారు.

పర్యాటక రంగం అభివృద్ధికి..

పర్యాటక రంగం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, నాగార్జున సాగర్ వద్ద విమానాశ్రయం ఏర్పాటుకు అవకాశాలపై అధ్యయనం కొనసాగుతోందని తెలిపారు. విజయపురిసౌత్ స్థలాన్ని నీటి పారుదల శాఖ నిర్వహించలేదని, ఆ గ్రామానికి గ్రామ పంచాయతీ హోదా ఇచ్చి పర్యాటక రంగం అభివృద్ధి కోసం ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. ఇప్పటికే మంజూరైన జాతీయ రహదారులు వివిధ దశల్లో ఉన్నాయని, ఓడరేవు - నకరికల్లు జాతీయ రహదారి విషయంలో రైతుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. యల్లమంద గ్రామంలో పట్టలు కుట్టే వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు చేయడం, రుణాలు అందించి ఉపాధి, వ్యాపార అవకాశాలు కల్పించే అవకాశాలపై జిల్లా అధికారులతో కమిటీ వేశామని తెలిపారు. లెదర్ పరిశ్రమ ఏర్పాటు కోసం రెండు, మూడు నియోజకవర్గాల్లో భూముల పరిశీలించామని, దుర్గిలో నిలిచిపోయిన లెదర్ పరిశ్రమ ఏర్పాటును కొనసాగించే అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలిపారు.

మండలానికి ఒక డ్రోన్

ఏప్రిల్ ఒకటి నుంచి కనీసం మండలానికి ఒక డ్రోన్ ఉండేలా ప్రణాళిక సిద్ధం చేశామని, జిల్లాకు మొత్తం 40 డ్రోన్లు మంజూరవగా రైతులకు శిక్షణిచ్చి మండలానికి కనీసం ఒక డ్రోన్ నిర్వాహకుడు ఉండేలా చూస్తామని కలెక్టర్ చెప్పారు. యువతకు నైపుణ్య శిక్షణా కార్యక్రమాల్లో భాగంగా పీఎం ఇంటర్న్ షిప్ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. అర్హులకు రూ.6 వేల వరకూ స్టైపెండ్ ఇచ్చి ఈ శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. సంక్షేమ హాస్టళ్ల పరిస్థితులను మెరుగుపరిచేందుకు సీఎస్సార్ నిధులను వినియోగించే అవకాశాలు పరిశీలిస్తున్నామన్నారు. ఫిబ్రవరి నాటికి జిల్లాలో మొత్తం 426 చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తెస్తామన్నారు.

ఆ ప్రదేశంలోనే పదేపదే ప్రమాదాలు!

ప్రజాశక్తి - దాచేపల్లి

పట్టణంలోని అద్దంకి నుండి నార్కెట్‌పల్లి వెళ్లే జాతీయ రహదారిపై తంగెడ మలుపు సమీపంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గురువారం మిర్చి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుండి లారీ ఢీ కొనటంతో ట్రక్కు బోల్తా పడింది. తంగెడ మలుపు వద్ద ఏర్పాటు చేసిన బ్రిడ్జి వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులంటున్నారు. ఈ మలుపు వద్ద గురువారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ ఢీకొని ఒకరికి గాయాలు పాలయ్యారని వారిని ప్రైవేటు వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. మాచవరం మండలం గోవిందాపురం నుండి మిర్చిలోడుతో వస్తున్న టాక్టర్‌ను పిడుగురాళ్ల వైపు నుంచి వస్తున్న లారీ వెనక నుండి ఢీకొనడంతో టాక్టర్ ట్రక్కు తిరగబడి మిర్చి బస్తాలు రోడ్డు పాలయ్యాయి. ట్రాక్టర్ డ్రైవర్ ప్రమాదం నుండి తృటిలో తప్పించుకున్నాడు.

పంటలకు సరైన ధరల్లేని కారణంగా మిర్చిని గురజాల మండలం అంబాపురం వద్ద ఉన్న కోల్డ్ స్టోరేజీలో దాచుకోవడానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం జరిగి రైతు జువ్వెన బోయిన ఆంజనేయులు లబోదిబోమంటున్నారు. పంట సాగుకు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టగా పంట చేతికొచ్చే సమయానికి మద్దతు ధర లేక, తక్కువ రేటుకు అమ్ముకోలేక 55 బస్తాల తేజ మిర్చిని, 8 బస్తాల తాలూకాలను కోల్డ్ స్టోరేజీకి తీసుకెళు న్నట్లు చెప్పారు. ప్రమాదంలో పంటతోపాటు ట్రాక్టర్ ట్రక్ దెబ్బతినడంతో రూ.40 వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. రోడ్డుపై మిర్చి బస్తాలు పడటం వల్ల హైవే మీద వాహనాలు భారీ స్థాయిలో నిలిచిపోయాయి. సిఐ భాస్కర్‌రావు హుటాహుటిన అక్కడికి చేరుకొని జెసిబి ద్వారా ట్రాక్టర్‌ను పక్కకు తీసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. హైవే అథారిటీ చొరవ చూపి ఈ ప్రదేశంలో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నేతాజీ త్యాగాలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్వాతంత్ర సమరయోధుడు, అజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు నరసరావుపేట పట్టణ సమీపంలోని చిలకలూరిపేట రోడ్డులోగల కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్వతంత్ర భారతావని సాధన దిశగా సాహసోపేతంగా అడుగులు వేసిన బోసును 'నేషనల్ ఐకాన్' గా నిలిపిందన్నారు. ఆయన ఆశయాలు, త్యాగాలు దేశ ప్రజలకు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమన్నారు. ఏ దేశమైనా పౌరుల కృషి, పరాక్రమంతోనే బలంగా తయారవుతుందని, భారతీయుల్లో నిద్రాణమై ఉన్న శక్తిని జాతీయవాదం వైపు మేల్కొల్పిందని అభివర్ణించారు. సుభాష్ చంద్రబోస్ అసమాన ధైర్యం, నిస్వార్థ దేశ సేవను స్మరించుకుంటూ ఆయన జయంతిని పరాక్రమ దివస్‌గా జరుపుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎం.ఆర్.కె.సతీష్‌బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ యోగేశ్వరరావు, జె.మల్లారెడ్డి, కె.అప్సర, శివుడు, జె.మల్లేశ్వరి, కె.శ్రీదేవి, వి.రజిని, ఎస్‌కె.మేరాబి, కె.బాజీ, ప్రభుదాసు, కెఎమ్ఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద సుభాష్ చంద్రబోస్ జయంతి నిర్వహించగా చిత్రపటానికి మున్సిపల్ కమిషనర్ పి.శ్రీధర్ పూలమాలలేసి నివాళు లర్పించి మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ వారితో పోరాడి ఎంతో మందిలో ఉద్యమ స్ఫూర్తిని సుభాష్‌చంద్రబోస్ కలిగించారని చెప్పారు. యువతను స్వాతంత్ర్యోద్యమం వైపు నడిపారన్నారు.

కార్మికుల గొంతుక కెఎస్ లక్ష్మణరావును గెలిపించండి

ప్రజాశక్తి - పెదకాకాని

పిడిఎఫ్ అభ్యర్థి కె ఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పెదకాకాని సిఐటియు మండల కన్వీనర్ నన్నపని శివాజీ అన్నారు. బుధవారం ఆయన గెలుపును కోరుతూ పలు ఆటోలపై స్టిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత కెఎస్ లక్ష్మణరావుదన్నారు. శాసనమండలి మేధావుల వేదికని, కావున ప్రజా సమస్యలపై నిబద్ధతతో పనిచేసే పిడిఎఫ్ అభ్యర్థి లక్ష్మణరావును మండలికి పంపించాలని పిలుపునిచ్చారు. 2007లో హిందూ కాలేజీలో సర్వీసును పూర్తిగా వదులుకుని ఎమ్మెల్సీగా గెలుపొందారని, నాటి నుండి నేటి వరకు అనేక సమస్యలపై చట్టసభల్లో, ప్రభుత్వ వేదికలపై పోరాడ్డంతోపాటు ప్రజా ఉద్యమాల్లోనూ ప్రత్యక్షంగా పాల్గొంటున్నారని చెప్పారు. పదవిని స్వలాభం కోసం కాక అనునిత్యం ప్రజల వెన్నంటి ఉండే స్వభావం ఆయనదని తెలియజేశారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలలో గతంలో మాదిరిగానే అఖండ విజయాన్ని ఆయనకు అందించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ మస్తాన్ వలి గంగాధర్ శ్రీనివాసరావు శంకర్ రఘు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెదనందిపాడు

రాష్ట్ర ప్రభుత్వం ఎలక్షన్ల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు డిమాండ్ చేశారు. గురువారం పెదనందిపాడు లోని తెళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సిపిఎం సమావేశం కొత్త వెంకటశివరావు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో రామారావు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గుంటూరు ఛానల్ పొడిగింపు కోసం సుదీర్ఘకాలంగా రైతులు, ప్రజలు ఆందోళన చేస్తున్నారని, ప్రభుత్వం వెంటనే భూ సేకరణకు అవసరమైన నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలని కోరారు. నల్లమడ వాగు ఆధునీకరణకు వెంటనే నిధులు కేటాయించాలన్నారు. పెదనందిపాడు, కాకుమాను మండలాలలో యూరియా కొరతగా ఉన్నదని, రెండు మండలాల పరిధిలోని సొసైటీలకు 200 టన్నుల యూరియా తక్షణం పంపించాలని కోరారు. యూరియా ను ప్రైవేటు వ్యాపారస్తులు అధిక రేట్లకు విక్రయించకుండా నియంత్రించాలన్నారు. ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజల మీద వేస్తున్న భారాలను రద్దు చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల స్థలాలు అందించి, ఇంటి నిర్మాణానికి 5 లక్షల రూపాయలు ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. రాజధాని అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలు చూస్తున్నాయని, ప్రజలు సంయమనం పాటించి వారి కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్ బాబు, నాయకులు జంపని రామారావు, దేవరకొండ శ్రీనివాసరావు, పి భువనేశ్వరి, మర్రి లక్ష్మి, పఠాన్ సలీం, నల్లమోతు రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాశం రామారావు

పోలీస్‌స్టేషన్‌లో డిఎస్‌పి తనిఖీ

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు పోలీస్ స్టేషన్‌ను గుంటూరు సౌత్ జోన్ డిఎస్పి జి భానోదయ గురువారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ చేశారు. తమ పరిధిలోని పత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను పోలీస్ స్టేషన్లను ఈరోజు పరిశీలించామన్నారు. మండలంలోని వివాదస్పద గ్రామాల గురించి పెదనంది పాడు ఎస్ఐ ఏ మధు పవన్ డిఎస్పీకి వివరించారు. రికార్డులు తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. వివాదస్పద గ్రామాలైన కొప్పర్రు, అన్నపర్రు గ్రామాలలో శాంతి భద్రతల దృష్ట్యా ముందు జాగ్రత్తగా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలు పరిరక్షించడమే తమ ధ్యేయం అని డి.ఎస్.పి భానోదయ అన్నారు. వారి వెంట పత్తిపాడు సీఐ జి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబుకు శుభాకాంక్షలు

ప్రజాశక్తి - తుళ్లూరు

సి ఆర్ డి ఎ నూతన కమిషనర్ గా కె కన్నబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడలోని సి ఆర్‌డిఎ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయననను అదనపు కమిషనర్ మల్లారపు నవీన్, జి సూర్య సాయి ప్రవీణ్ చంద్ ఆధ్వర్యంలో సిఆర్‌డిఎ లోని అన్ని విభాగాల ఇన్‌చార్జులతో సమావేశమయ్యారు. ఆయా విభాగాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసు కున్నారు. అదనపు కమిషనర్ లతో పాటు సిబ్బంది కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

నిబంధనలకు లోబడి ఇసుక తవ్వాలి

ప్రజాశక్తి - కొల్లిపర

ప్రభుత్వ నిబంధనలకు లోబడి మాత్రమే ఇసుక త్రవ్వకాలు జరపాలని తెనాలి ట్రెనింగ్ సబ్ కలెక్టర్ స్వాప్నిల్ పవార్ అన్నారు. గురువారం కొల్లిపర మండలంలోని ఇసుక రీచ్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రీచ్‌లో సమయపాలన పాటించాలని నిర్వాహకులకు తెలిపారు. ఇసుక త్రవ్వకాల్లో యంత్రాలను ఉపయోగించవద్దని హెచ్చరించారు. ప్రభుత్వము నిర్ణయించిన ధరలు మాత్రమే తీసుకోవాలని ఎటువంటి అవకతవకలు జరిగిన చర్యలు తప్పవని తెలిపారు. తనిఖీలలో కొల్లిపర ఎస్సై కోటేశ్వరరావు తాసిల్దార్ సిద్ధార్థ రెవెన్యూ విజిలెన్స్ గంగుల శాఖ అధికారులు పాల్గొన్నారు.

తుళ్లూరులో

గుంటూరులో

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా టిడిపి కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలు జరిగాయి. కేక్ కోసి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. బృందావన్ గార్డెన్స్ లోని ప్రభుత్వ అంధుల పాఠశాలలో తెలుగు యువత జిల్లా అధ్యక్షులు రావిపాటి సాయికృష్ణ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కేకు కోసి విద్యార్థులకు పంపిణీ చేశారు. రాష్ట్ర ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ప్రారంభించారు రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే గల్లా మాధవి కార్యాలయంలో జరిగిన లోకేష్ జన్మదిన వేడుకల్లో నగర టిడిపి నాయకులు డేగల ప్రభాకర్, మద్దిరాల మ్యాని, కనపర్తి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఐలాండ్ వద్ద లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు విద్యార్థి జిల్లా అధ్యక్షులు మన్నవ మోహన్‌కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక నవభారత్ నగర్ మూడో లైన్‌లో నిర్వహించారు. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నసీర్ పారిశుద్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేశారు. మంగళగిరిలో రాష్ట్ర మంత్రి మంగళగిరి స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ జన్మదిన పురస్కరించుకొని మంగళగిరి పట్టణంలోని వివర్స్ కాలనీలో గల మున్సిపల్ హైస్కూల్లో సోలార సంస్థ వారిచే 1100 మంది విద్యార్థిని విద్యార్థులకు ధర్మ వాటర్ బాటిల్స్ ను గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తదితరులు పంపిణీ చేశారు. ఆచార్య నాగార్జున వర్సిటీలో టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి కేక్ కట్ చేశారు. ప్రత్తిపాడులో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఆధ్వర్యంలో లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాడికొండలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేసి వేడుకలు నిర్వహించారు. తుళ్లూరులో టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ కేక్ కట్ చేశారు.రక్తదానం చేసిన వారికి ఎమ్మెల్యే సర్టిఫికెట్ అందజేశారు. దుగ్గిరాలలో చింతల పూడిలో ప్రయదర్శిని ఇంజినీరింగ్ విద్యార్థులు, టిడిపి నాయకులు రక్తదానం చేశారు.

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్ : మంగళగిరి శాసనసభ్యులు, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలు ఎంటిఎంసి పరిధిలోని, గుండిమెడ గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలలో గురువారం టి డి పి మండల మాజీ అధ్యక్షులు కొమ్మా రెడ్డి కిరణ్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. జన్మ దినోత్సవ కేక్ ను కొమ్మా రెడ్డి కిరణ్, కళ్లం రాజశేఖర రెడ్డి కట్ చేసి,శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ టిడిపి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత మంగళగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారని అన్నారు. అనంతరం పాఠశాలల్లోని విద్యార్థిని, విద్యార్థులకు నోట్సు పుస్తకాలు, పండ్లు ను తెలుగుదేశం నాయకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం తాడేపల్లి మండల ఉపాధ్యక్షులు గుండిమెడ రమేష్ బాబు, తెలుగుదేశం గుంటూరు జిల్లా పార్లమెంట్ అధికార ప్రతినిధి కాసిం ఖాన్, తెలుగు రైతు గుంటూరు జిల్లా అధ్యక్షులు కళ్లం రాజశేఖర్ రెడ్డి, తెలుగు దేశం నాయకులు చిగురు పాటి సుబ్బారావు,నామతోటి రాంబాబు , పాటి బండ్ల వెంకటేశ్వర రావు, ఆంజనేయ ప్రసాద్, కొమ్మారెడ్డి బుజ్జి, కాసర్లడ్డ అంకి నీడు, తెలుగు మహిళా నాయకురాలు శొంఠి కళ్యాణి పాల్గొన్నారు.

గుండి మెడ ఎలిమెంటరీ పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న టిడిపి తాడేపల్లి మండల మాజీ అధ్యక్షులు కొమ్మారెడ్డి కిరణ్

కుక్కలకు సర్జరీలపై ఫిర్యాదులను సహించం

ప్రజాశక్తి - గుంటూరు

ఎబిసి సెంటర్లో సర్జరీల నిర్వహణపై ఫిర్యాదులు వస్తే సహించబోమని మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు హెచ్చరించారు. ఏటుకూరి రోడ్డులోని ఎబిసి సెంటర్‌ను గురువారం తనిఖీ చేసిన ఆయన తొలుత స్టెరిలైజేషన్ సెంటర్‌లో సర్జరీలు, రికార్డులను తనిఖీ చేశారు. సర్జరీల నిర్వహణలో అవకతవకలు జరుగుతున్నట్లు వార్తలొస్తున్నాయన్నారు. గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల ప్రకారం కంపోస్టు యార్డు పక్కన స్టెరిలైజేషన్ చేయకూడదని, అందుకే ఈనెల 10 నుండి ఈ ప్రాంతంలో నిలిపేశామని చెప్పారు. కుక్కలకు నిర్వహిస్తున్న సర్జరీల విషయంలో డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిబంధనల ప్రకారం సర్జరీ తర్వాత 7 రోజులు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచాలని, ఆ తర్వాతే వాటిని ఎక్కడి నుంచి పట్టుకొచ్చారో అక్కడే వదిలేయాలని చెప్పారు. ఆపరేషన్ అనంతరం సంరక్షణ సమయంలో కుక్కలకు తగిన ఆహారం అందిస్తూ, పర్యవేక్షించాలన్నారు. సర్జరీ సమయంలో అవయవాల లెక్కింపు పక్కాగా ఉండాలన్నారు. నగరంలోని ప్రతి డివిజన్‌లో మూగజీవాల పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎక్కడా లేని విధంగా గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఆవుల దొడ్డి ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కాండ్రు కుంట గురవయ్య, సిఎంఒహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఒ డాక్టర్ రవిబాబు, వెటర్నరీ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

జడ్‌పి ఆస్తులకు రక్షణ

ప్రజాశక్తి - పెదనందిపాడు

జిల్లాలో జడ్పీ ఆస్తుల పరిరక్షణ తమ ధ్యేయమని డిప్యూటీ సీఈవో సిహెచ్ కృష్ణ అన్నారు. గురువారం పెదనందిపాడు జడ్పీ పాఠశాల ముందు ఉన్న జడ్పీ కాంప్లెక్స్ అద్దెల బకాయిలు వసూళ్ల నిమిత్తం పెదనందిపాడు వచ్చిన సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కాంప్లెక్స్ అద్దెలు గత ఏడాది రూ.12.67 లక్షల బాకీ ఉందన్నారు. కాంప్లెక్స్ ముందు ఉన్న మురుగు కాలవ మరమ్మత్తులకు రూ.3.60 లక్షలు కేటాయించామని త్వరలో పనులు మొదలు పెడతామన్నారు. మురుగునీరు వాగులోకి తరలించేందుకు రెండు విడతలుగా డ్రైనేజీ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. అబ్బినేని గుంట పాలెం జడ్పీ పాఠశాల ఎదురుగా కూడా కాంప్లెక్స్ నిర్మాణానికి అంచనాలు తయారు చేయమని సంబంధిత అధికారికి ఆదేశాలు జారీ చేశారు. అదే గ్రామంలో జిల్లా పరిషత్ కు చెందిన ఐదు ఎకరాల 75 సెంట్లు భూమిని ఎకరం 15,000 రూపాయలు చొప్పున కౌలుకి ఇచ్చామన్నారు. సమావేశంలో ఎంపీడీవో జి లక్ష్మీదేవి. ఏవో నాగ రాజు, ఆర్డబ్ల్యుఎస్ డిఈ రమేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రైల్వే గేటు బంద్

ప్రజాశక్తి - దుగ్గిరాల

విజయవాడ నుండి గూడూరు వరకు మూడవ రైల్వే లైను నిర్మాణ పనుల్లో భాగంగా శుక్రవారం దుగ్గిరాల రైల్వే స్టేషన్ దక్షిణ వైపున ఉన్న రైల్వే గేటును ఉదయం 7 నుండి సాయంత్రం ఐదు గంటల వరకు మూసి వేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ మార్గం ద్వారా ప్రయాణించవలసిన వారు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ప్రయాణించాలని కోరారు.

పంచాయతీ ఆస్తిని కాపాడాలని వినతి

ప్రజాశక్తి - దుగ్గిరాల

గ్రామానికి చెందిన పంచాయతీ ఆస్తిని కాపాడవలసిందిగా మండలంలోని పేరుకలపూడి గ్రామ సర్పంచ్ గంపల గంగాధర్ డిపిఒ సాయికుమార్ గురువారం అర్జీ ఇచ్చారు. రోడ్డును పరిశీలించే నిమిత్తం డిపిఒ పేరుకలపూడి గ్రామానికి రాగా సర్పంచ్ ఆయనకు అర్జీ ఇచ్చారు. గతంలో తాను స్మశాన స్థలాన్ని ఆక్రమణదారుల నుండి పంచాయతీకి స్వాధీనం చేశానని తిరిగి ఆక్రమణదారులు స్మశాన స్థలాన్ని ఆక్రమించి అందులో మద్యం(బెల్టు షాపు) నిర్వహిస్తున్నారని అర్జీలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు ఈవో పీఆర్డీ జవహర్లాల్ నెహ్రూ తదితరులు డిపిఒ త పాటు ఉన్నారు.

మోడల్ స్కూల్ ఆటస్థలం అభివృద్ధి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం గ్రామంలోని మోడల్ స్కూల్ ఆటస్థలాన్ని పీఎం శ్రీ నిధులతో అభివృద్ధి చేశారు. 200మీటర్ల రన్నింగ్ ట్రాక్, రెండు కబడ్డీ కోర్టులను గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రవినాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలన్నారు. క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పీఎం శ్రీ నిధులతో అభివృద్ధి పరిచిన 200 మీటర్ల రన్నింగ్ ట్రాక్, కబడ్డీ కోర్టులను ఉపయోగించుకుని విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో గెలిచి, పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎంసి ఛైర్మన్ యు.రామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డాక్టర్ శాంతిబాయికి తెలుగు కీర్తి పురస్కారం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

కొన్ని సంవత్సరాలుగా మాచర్ల పరిసర ప్రాంతాల్లో డాక్టర్ సాంబేలు శాంతిబాయి చేస్తున్న సాహిత్య సేవలకు తెలుగు కీర్తి పురస్కారం లభించింది. ఈ నెల 21వ తేదీన విజయవాడలోని శ్రీ కౌత పూర్ణానంద్ విలాస్ కళావేదికలో జరిగిన కార్యక్రమంలో శ్రీ శ్రీ కళావేదిక ఆమెకు పురస్కారం అందజేసింది. పద్మ విభూషణ్ గ్రహీత పోయి భీమన్న సతీమణి హైమావతి, శ్రీ శ్రీ కళావేధిక సీఈఓ కత్తిమండ ప్రతాప్, హైమావతి, ఈశ్వరి భూషణం, లలిత, బాలార్జున చేతుల మీదుగా శాంతి బాయి సత్కారం పొందారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, మున్సిపల్ కమిషనర్ ఎం. జస్వంతరావు ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ బాయ్స్ గర్ల్స్ హైస్కూల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి 25వ స్థానిక భువనచంద్ర టౌన్ హాల్ నందు జరిగే నేషనల్ ఓటర్స్ డే కార్యక్రమంలో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి చేతుల మీదుగా బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

ఘనంగా మంత్రి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- కారంపూడి : రాష్ట్ర మంత్రి లోకేష్ పుట్టినరోజు వేడుకలు మండలంలోని ఒప్పిచర్ల గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకులు పలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు.

'రాష్ట్రాభివృద్ధి మంత్రి లోకేష్ ధ్యేయం'

ప్రజాశక్తి - వినుకొండ

అందరి మన్ననలు అందుకుంటున్న అరుద్కైన నాయకుడు మంత్రి లోకేష్ అని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. విద్యారంగం, యువతపై ఆయనకు ఉన్న ప్రత్యేక అభిమానం, పట్టింపు రేపటి ఆంధ్రప్రదేశ్ మరింత ఉజ్వలంగా ఉండేందుకు బాటలు వేయనుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వినుకొండ మండలం విఠంరాజుపల్లి సమీపంలోని సెయింట్ ఆన్స్ ఉషోదయ మానసిక వికలాంగుల పాఠశాలలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి లోకేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి విద్యార్థులకు చీఫ్ విప్ జీవీ స్వయంగా భోజనాలు వడ్డించారు. అనంతరం మాట్లాడిన ఆయన.. నాయకుడిగా ఎంత ఎదిగినా అవసరంలో ఉన్నవారి విషయంలో మానవత్వంతో స్పందించి సాయం చేయడంలో ఉన్న తప్తిని లోకేష్‌ను చూసే నేర్చుకుంటున్నామని అన్నారు. ఇటు ప్రజలకు, అటు కార్యకర్తలకు ఆయన చేసిన సేవా కార్యక్రమాలు ఎప్పటికప్పుడు తమలో కొత్తస్ఫూర్తిని నింపుతూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి రూరల్ : లోకేష్ జన్మదిన వేడుకలు సత్తెనపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. సత్తెనపల్లి రఘురామ్ నగర్ లోని ప్రజా వేదిక టిడిపి నాయకులు కేక్ కట్ చేసి లోకేష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నేతలు యెలినిడి రామస్వామి, పూజల వెంకట కోటయ్య, ఆతుకురు నాగేశ్వరావు, గోగినేని

కోటేశ్వరరావు, సయ్యద్ పెద్ద కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల : స్థానిక టీడీపీ కార్యాలయంలో మంత్రి లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షులు పాండురంగ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంచి పెట్టారు.

పల్నాడు జిల్లా : జిల్లా టిడిపి కార్యాలయంలో పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ సూచన మేరకు రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్, టిడిపి రాష్ట్ర డాక్టర్ సెల్ ఉపాధ్యక్షులు కడియాల వెంకటేశ్వరరావు పాల్గొని కేక్ కట్ చేసి పంచి పెట్టారు. పార్టీకి, కార్యకర్తలకు లోకేష్ అండగా ఉంటున్నారని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్, నాయీబ్రాహ్మణుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, రాష్ట్ర నాయకులు గొట్టిపాటి జనార్దన్ బాబు, మన్నన్ షరీఫ్, జిల్లా పార్టీ ప్రధాన

కార్యదర్శి కొట్టా కిరణ్, పల్నాడు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు కుమ్మెత కోటిరెడ్డి, పల్నాడు జిల్లా టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు కూరపాటి హనుమంతరావు, తెలుగు యువత నాయకులు శాఖమూరి మారుతి, పొనుగోటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను విజయపురిసౌత్ లో టీడీపీ, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ మాచర్ల మండల అధ్యక్షుడు నేరేటి వీరాస్వామి యాదవ్ కేట్ కట్ చేసి స్థానికులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో విజయపురిసౌత్ టీడీపీ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, ఎన్.బసివిరెడ్డి,ఆడెపు కోటయ్య, మత్యకారుల సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, సత్తిబాబు, జనసేన అధ్యక్షుడు రాహుల్, ఘంటా ధనుంజయరావు, ఊరే మార్క్, చంద్రశేఖర్, మస్తాన్,నర్సింహులు,తగుళ్ల కష్ణ,శ్రీను,బాలస్వామి, చరణ్,పవన్,రామ్ చంద్, పండు,నూకరాజు,మంగమ్మ,దానియేలు తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు : పెదకూరపాడులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మండల టిడిపి పార్టీ అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మాగులూరి భాను ప్రకాష్, బెల్లంకొండ రాంగోపాల్రావు, భాష్యం ఆంజనేయులు, వడ్లమూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవంపై విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

జాతీయ ఓటర్ల దినోత్సవం నేపథ్యంలో గురువారం పెదకూరపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నియోజకవర్గ స్థాయి వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, పాటలు, స్కిట్ పోటీలు నిర్వహించారు. క్విజ్ పోటీలలో పెదకూరపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు షేక్ అఫ్రోజా ,షేక్ ఆసిపాతబుసం మొదటి బహుమతి, కే హేమంత్ రెడ్డి, అశోక్ రెడ్డి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల తాళ్లూరు ద్వితీయ బహుమతి సాధించారు. వక్తృత్వం పోటీలలో మొదటి బహుమతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాళ్లూరుకు చెందిన దివ్యశ్రీ, రెండో బహుమతి అచ్చంపేటలోని బ్లూబెల్స్ పాఠశాల విద్యార్థి మణికంఠ సాధించారు. వ్యాసరచన పోటీలలో దొడ్లేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ సమీరా భాను మొదటి స్థానం, గారపాడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రూప శ్రీ రెండో బహుమతి సాధించారు. డ్రాయింగ్ పోటీలలో అచ్చంపేట లోని బ్లూబెల్స్ విద్యార్థి జయ సాయి ప్రియ మొదటి స్థానం సాధించగా, పెదకూరపాడు లోని సెయింట్ ఆన్స్ హై స్కూల్ విద్యార్థి ఎండి వసీం అక్రమ్ రెండో బహుమతి అందుకున్నారు. పాటల పోటీలలో దొడ్లేరు లోని జిల్లా

పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జ్యోతికా భాయి మొదటి బహుమతి అందుకోగా, తాళ్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బ్లెస్సి రెండో బహుమతి అందుకున్నారు. స్కిట్ పోటీలలో పెదకూరపాడు లోని సెయింట్ ఆన్స్ హై స్కూల్ ప్రథమ స్థానం సాధించగా, అచ్చంపేటలోని శ్రీ మార్గదర్శి స్కూలు రెండవ స్థానం నిలుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 తాడిశెట్టి సత్యనారాయణ ,పెదకూరపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాని వెంకటరమణ, ఇతర ప్రధానోపాధ్యాయులు చేతుల మీదుగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి కారంపూడి

మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. పశు వైద్యాదికారి డాక్టర్ బి.సాల్మన్ సింగ్ పశువులకు ఉచితంగా పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఉచిత పశు వైద్య శిబిరాలను రైతులు వినియోగించుకోవాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాల సైదులు, సంగం డెయిరీ ప్రెసిడెంట్ బి.సంజీవ రెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, సాంబశివరావు, కోటిరెడ్డి, పశు వైద్య సిబ్బంది బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అంగలూరులో పశు ఆరోగ్య శిబిరం

ఈపూరు : మండలంలోని అంగలూరు గ్రామంలో ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు పి.శ్రీనివాసమూర్తి పర్యవేక్షణలో మండల పశువైద్యాధికారి వి.గోపాల్ నాయక్ పశువైద్య సిబ్బందితో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 985 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, 40 లేత దూడలకు నట్టల నివారణ, 45

పాడి గేదెలు, ఆవులకు నట్టల నివారణ, మూడు గేదెలకు చూడి పరీక్షలు, 38 గేదెలకు సాధారణ పరీక్షలు, రెండు గేదెలకు కత్రిమ గర్భధారణ వైద్యం చేసి పశుపోషకులకు మందులు పంపిణీ చేశారు. పశు పోషకులను ఆదుకునేందుకే ప్రభుత్వం ఉచితంగా వైద్య శిబిరాలను నిర్వహిస్తోందని వైద్యాధికారులు తెలిపారు. ఈ శిబిరాల్లో పశువులకు అవసరమైన పరీక్షలు, చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. పశు పోషకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం వి.రెడ్డిపాలెం గ్రామంలోని పి.ఎం.మోడల్ స్కూల్ లో ఈ నెల 21 నుంచి జరుగుతున్న సామాజిక తనిఖీ గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రవి నాయక్ అధ్యక్షత వహించారు. ఈ సభలో పాల్గొన్న తనిఖీ అధికారి కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో సామాజిక తనిఖీ చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకష్ణన్ విద్యార్థి మిత్ర పథకం, ఇతర పథకాల అమలు, హాస్టల్లో ఉన్న రిజిస్టర్లను, రికార్డులను భౌతికంగా పరిశీలించి, నివేదికను రూపొందించి, గ్రామ సభలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎస్. యం. సి ఛైర్మన్ యు.రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ వద్ద ప్రయాణికుల పాట్లు

ప్రజాశక్తి- మాచర్ల రూరల్

రైల్వే స్టేషన్ వద్ద రద్దీతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మాచర్ల నుంచి రైలు మూడు సార్లు వెళ్లి.. మూడు సార్లు వస్తుంది. బస్ ప్రయాణ చార్జీలతో పోల్చినప్పుడు రైలు ప్రయాణ చార్జీలు ఎంతో తక్కువగా ఉండటంతో అన్ని వర్గాల ప్రజలు ఎక్కువగా రైలు ప్రయాణం వైపు మొగ్గు చూపుతున్నారు. రైలు వచ్చిన ప్రతి సందర్భంలోనూ వందల మంది ప్రయాణికులు దిగుతున్నారు. ప్రతి సందర్భంలో ఆటోల వారు ఇష్టానుసారం, ప్రధాన మార్గానికి అడ్డదిడ్డంగా రహదారులపైన పార్కింగ్ చేయటంతో నడక దారి చాలా ఇరుకుగా మారుతోందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు జోక్యం చేసుకుని ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఆటోలు ఒక క్రమపద్ధతి ప్రకారం పార్కింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని రైలు ప్రయాణికులు కోరుతున్నారు. ఇదే సందర్భంలో రైలు రాకపోకలు సాగించే 6 సార్లు రైల్వేస్టేషన్ నుంచి శిరిగిరిపాడు రూట్, విజయపురిసౌత్‌కు బస్ సౌకర్యం ఏర్పాటు చేస్తే చాలా సౌకర్యవంతంగా ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదురుగా రెండు రోజులపాటు నిర్వహించనున్న మెప్మా అర్బన్ మార్కెట్ గురువారం ప్రారంభమైంది. పొదుపు సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ ను మున్సిపల్ చైర్పర్సన్ తాడిబోయిన రాధిక పరిశీలించారు. ప్రదర్శన, అమ్మకాల కోసం మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదుపు సంఘాల మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకుంటూ స్వశక్తితో ఎదగాలన్నారు. రెండు రోజులపాటు జరిగే అర్బన్ మార్కెట్ విక్రయాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని మహిళలను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బి.శేషన్న, మేనేజర్ చండి దేవసేన, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయకుమారి, సిఆర్పీలు, సిఒలు పాల్గొన్నారు.

చంద్రబోస్‌కు నివాళులు

ప్రజాశక్తి - గుంటూరు

సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా బండ్లమూడి హనుమాయమ్మ మహిళా డిగ్రీ కాలేజీలో నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ నగేష్ హాజరుకాగా, ప్రిన్సిపాల్ డాక్టర్ కౌసల్యదేవి, వైస్ ప్రిన్సిపాల్ ఎ.రాధామధవి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఎం.ఎస్ గిరిజ, ఎన్.లక్ష్మీదీప్తి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వైద్యశిబిరంలో 300 మందికి సేవలు

ప్రజాశక్తి - గుంటూరు

సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి సందర్భంగా (పరాక్రమ దివస్) స్విగ్ద ఆయుర్వేదిక్ ఫౌండేషన్, సుభాష్ చంద్రబోస్ మిత్రమండలి, విశ్వఆయుర్వేద పరిషత్ ఆధ్వర్యంలో ఇంటర్ రింగు రోడ్డులోని వైఎస్ఆర్ పార్కులో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 300 మందికి అర్థరైటిస్, స్పాండిలైటిస్, రహేమాటాయిడ్ అర్థరైటిస్ తదితర వ్యాధులకు పరీక్షలు చేయడంతోపాటు రక్తపరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, స్విగ్ద గ్రూపు హాస్పిటల్స్ చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ గోపాలన్, స్విగ్ద ఆయుర్వేదిక్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చైతన్య, విశ్వ ఆయుర్వేదిక్ పరిషత్ సభ్యులు డాక్టర్ సుదర్శన్, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ భవ్యశ్రీ, సుభాష్ చంద్రబోస్ మిత్రమండలి సభ్యులు ఎం.శైలజ, హర్షవర్ధన్, మహేంద్ర పాల్గొన్నారు.

బోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఎబిఎస్ ఎఫ్ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎబిఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి బూదాల రాజేష్ తదితరులు బోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అధ్యక్షులు నాసరయ్య మాట్లాడుతూ సుభాష్ చంద్ర బోస్ ప్రాణత్యాగాల వల్ల ఈ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వచ్చిందని, యువత ఆయను ఆదర్శంగా చేసుకుని దేశ అభ్యున్నతికి పాటు పడాలని పిలుపునిచ్చారు.

ఎన్నారై కళాశాలలో చంద్రబోస్ జయంతి

మేడికొండూరు : మండలంలోని విశదల అడ్డరోడ్డు వద్ద గల ఎన్నారై ఇంజినీరింగ్ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ప్రిన్సిపాల్ కోట శ్రీనివాస్, ప్రముఖ సాఫ్ట్వేర్ కంపెనీ అధినేత శరత్ ముఖ్యఅతిథిగా పాల్గొని నేతాజీ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. గొప్ప పోరాట యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని తెలిపారు.

నూతన ఆవిష్కరణలకు 'సిస్టమ్స్' దోహదం

ఎస్ఆర్ఎంలో ఇంజినీరింగ్ సమ్మిట్ ప్రారంభం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రెండు రోజుల పాటు జరిగే సిస్టమ్స్ ఇంజినీరింగ్ సమ్మిట్ గురువారం ప్రారంభమైంది. వర్సిటీలోని అబ్దుల్ కలామ్ ఆడిటోరియం వేదికపై జ్యోతి వెలిగించి, వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య మనోజ్ కుమార్ అరోరా సమ్మిట్‌ను ప్రారంభించారు. ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి రామకృష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ కంపెనీల మేనేజింగ్ డైరెక్టర్లు, సీఈవోలు, పరిశోధన రంగానికి చెందిన పలువురు నిపుణులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం వైస్ ఛాన్సలర్ మనోజ్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లోనూ సిస్టమ్స్ ఇంజినీరింగ్ ప్రాధాన్యత పెరుగుతుందని, వివిధ పరిశ్రమలు సిస్టమ్స్ ఇంజినీరింగ్ టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న నేపథ్యంలో యూనివర్సిటీలు సైతం పాఠ్య ప్రణాళికను తదనుగుణంగా మార్చుకోవాలన్నారు. ఎఫ్ట్రానిక్స్ కంపెనీ ఎండీ రామకృష్ణ మాట్లాడుతూ, అభివృద్ధి చెందుతున్న దేశాలు సిస్టమ్స్ ఇంజినీరింగ్పై ప్రత్యేకంగా దృష్టి సారించాయనీ, నూతన ప్రాజెక్టుల ఆవిష్కరణకు సిస్టమ్స్ ఇంజినీరింగ్ దోహదపడుతుందన్నారు. ఏవియేషన్, రైల్వేస్, ఎలక్ట్రికల్స్, ఆటోమొబైల్ రంగాల్లో సిస్టమ్స్ ఇంజినీరింగ్ నిపుణులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ వంటి సాంకేతికత సిస్టమ్స్ ఇంజినీరింగ్లోనూ ఉందన్నారు. ఉన్నత విద్యను బోధించే విద్యా సంస్థలు తమ పాఠ్యప్రణాళికల్లో ఇందుకు సంబంధించిన అంశాలను పొందుపర్చాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ఈ రంగంలో వర్క్‌షాప్‌లు, సెమినార్లు ఎంతో అవసరమన్నారు. విజయవాడ వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఏపీ విఐటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ గంగాధరరావు తదితరులు ప్రసంగించారు. అమరావతిలో ఈ తరహా వర్క్‌షాప్ నిర్వహణకు ముందుకొచ్చిన ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ, ఎఫ్ట్రానిక్స్ ఎండీ రామకృష్ణకు అభినందనలు తెలియజేశారు. ఏపీ ఎస్ఆర్ఎం-ఎఫ్ట్రానిక్స్ మధ్య ఎంవోయూ జరిగింది. ఇంకోస్ సంస్థ వివిధ యూనివర్సిటీలతో ఎంవోయూ చేసుకుంది. సిస్టమ్స్ ఇంజినీరింగ్ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని వక్తలు సూచించారు.

పారిశుధ్యంపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - గుంటూరు

గుంటూరు నగరంలో ఇంటింటా చెత్త సేకరణ, ఖాళీ స్థల యజమానులకు నోటీసులు జారీ చేయడంలో శానిటేషన్ కార్యదర్శులు, ఇన్స్పెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సూచించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే వారిపై చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గురువారం ఆయన శ్రీరామ్ నగర్, ఎన్జీఓ కాలనీ, ఏటీ అగ్రహారం, సాయినగర్, దుర్గానగర్, కెవిపి కాలనీ, కావేరి కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించారు. ఇంటింట చెత్త సేకరణ, డ్రైన్ శుభ్రంపై ప్రజల ఫిర్యాదు మేరకు పరిశీలించిన ఆయన.. కార్యదర్శులు, ఇన్స్పెక్టర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరంలో పారిశుద్ధ్య పనుల మెరుగుదల కోసం కృషి చేస్తుంటే కొంత మంది సిబ్బంది, అధికారులు నిర్లక్ష్య వైఖరితో ఉంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు మరింత శ్రద్ధ చూపాలని.. ఎంహెచ్ఓ, సిఎంఓహెచ్‌లు ఉదయం, మధ్యాహ్నం క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. ఖాళీ స్థలాల్లో అపరిశుభ్ర వాతావరణం ఉండటంపై ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. వార్డు సచివాలయాల వారీగా ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి,

స్పందించని స్థలాల్లో జిఎంసి బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నగర ప్రజలు కూడా గుంటూరు నగరాన్ని సుందర, శుభ్రమైన నగరంగా తీర్చిదిద్దుకోవడానికి నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు. తమ ఇంటి ముందుకు చెత్త తీసుకోవడానికి ప్రజారోగ్య కార్మికులు రాకుంటే జిఎంసి కాల్ సెంటర్ 0863-2345103 కి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. నగరంలో బ్లాక్ స్పాట్స్ నిషేధించామని, ప్రజలు తమ ఇళ్లల్లో వ్యర్థాలు రోడ్లు, కాల్వల్లో వేస్తే భారీ మొత్తంలో అపరాధ రుసుం విధిస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక బృందాల ద్వారా పర్యవేక్షణ చేయిస్తున్నామని, సిసి కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పర్యటనలో డిఈఈ మధుసూదన్, ఏసిపి వెంకటేశ్వరరావు, ఏఈలు పాల్గొన్నారు.

మంగళగిరి ప్రీమియర్ లీగ్ విజేత గుంటూరు

ప్రజాశక్తి-మంగళగిరి

ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ లో గుంటూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. గుంటూరు, నెల్లూరు మధ్య ఉత్కంఠ భరితంగా గురువారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు జట్టు 6 వికెట్ల తేడాతో గెలుపొందింది విజేత జట్టుకు భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, ఏపీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, ఏపీఏ అపెక్స్ కమిటీ కౌన్సిల్ మెంబర్ దంతు గౌరు విష్ణు తేజ్, సేల్ కంపెనీ యాజమాని రాఖీ గిల్, సక్కు గ్రూపు అధిపతి ధర్మతేజ చేతుల మీదగా నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఫైనల్ మ్యాచ్‌తో క్రికెట్ స్టేడియం సందండిగా మారింది. పోటీలను తిలకించేందుకు యువత, క్రీడాభిమానులు, ప్రజలు, మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ నెల 12 నుంచి 23వ తేదీ వరకు పోటీలను అద్భుతంగా నిర్వహించిన నిర్వాహకులను అంబటి రాయుడు అభినందించారు. తుది పోరులో టాస్ గెలిచిన గుంటూరు జట్టు బౌలింగ్ తీసుకుంది. బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 20 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 160 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ కు దిగిన గుంటూరు జట్టు 18.4 ఓవర్లలో 161 పరుగులు చేసి విజయం సాధించింది. 48 పరుగులు చేసి 5 వికెట్లు తీసిన మహిప్ కుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ను గెలుచుకున్నారు. తృతీయ స్థానం కోసం కడప, విజయనగరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు విజయం సాధించింది. 23 బంతుల్లో 50 పరుగులు చేసిన కుమార్ రెడ్డి మ్యాన్ ఆఫ్ ది

మ్యాచ్ సొంతం చేసుకున్నారు. ఈవెంట్ స్పాన్సర్లగా సేల్, సక్కు, మార్కోలోన్, ఉషోదయ సంస్థలు వ్యవహరించాయి. ప్రీమియర్ లీగ్, సీజన్-3 పోటీలలో విజేతగా నిలిచిన గుంటూరు జట్టుకు కొమ్మారెడ్డి కిరణ్ సహకారంతో రూ.3 లక్షల నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన నెల్లూరు జట్టుకు రూ.2 లక్షలు కాట్రగడ్డ మధుసూదనరావు, తృతీయ స్థానంలో నిలిచిన కడప జట్టుకు రూ.లక్ష నగదును పల్నాటి నాగేశ్వరరావు, అమిరిశెట్టి సాంబశివరావు సహకారంతో నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా అంబటి రాయుడు మాట్లాడుతూ నియోజకవర్గంలోని యువతను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో మంత్రి నారా లోకేష్ ఎంతో ఖర్చుతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం టోర్నమెంట్లను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మండల ప్రధాన కార్యదర్శి మల్లవరపు వెంకట్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొనసాగిన ఏసీసీ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

మూడు దశాబ్దాల పైగా న్యాయపోరాటం చేస్తున్న ఎసిసి కార్మికుల సమస్యను పరిష్కరించరా? అని సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు ప్రశ్నించారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఎసిసి కార్మికుల రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎసిసి కార్మికుల పట్ల పాలక పక్షాలు ఇంత నిర్లక్ష్యం వహించడం అన్యాయమన్నారు. తమకు రావలసిన నష్టపరిహారం కోసం శాంతియుతంగా దీక్షలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని ఆయన మండిపడ్డారు. ఒకవైపున కార్మిక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులతోనూ, అనారోగ్యంతోను చనిపోతున్న కనికరం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఎసిసి కార్మికుల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. దీక్షలలో ఎస్.లాజర్ బాబు, ఎస్.పుష్పలీల, వి.లక్ష్మి, బి.దానయ్య, బి.జోజప్ప కూర్చున్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి

ప్రజాశక్తి-తెనాలి

పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రజలు కూడా సహకరించాలని మున్సిపల్ చైర్పర్సన్ తాడి బోయిన రాధిక కోరారు. పురపాలక సంఘ పరిధిలో 25, 26 వార్డులలో గురువారం నిర్వహించిన శానిటేషన్ పనులను ఆమె పరిశీలించారు. స్థానికుల నుంచి అక్కడ ఉన్న శానిటేషన్ సమస్యలను కూడా తెలుసుకున్నారు. సైడ్ డ్రయిన్స్ పూడికతీత, ఇంటింటి చెత్త సేకరణ తదితర పనులపై సిబ్బందికి ఆమె పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.హెలెన్ నిర్మల, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సాంబశివరావు, అసిస్టెంట్ ఇంజనీర్ సునీల్ కుమార్, శానిటరీ ఇన్ స్పెక్టర్ జి.ప్రసాద్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

'అంబేద్కర్ విగ్రహాల జోలికొస్తే తీవ్ర పరిణామాలు'

ప్రజాశక్తి-తెనాలిరూరల్

అంబేద్కర్ విగ్రహాల జోలికి వస్తే ఎవరైనా సహించేది లేదని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఆర్‌జే మల్లికలు, గుంటూరు జిల్లా అధ్యక్షులు కూరపాటి సుబ్బారావు స్పష్టం చేశారు. తెనాలి నియోజకవర్గం సమీక్ష గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు పాల్గొన్నారు. తొలుత తెనాలి రజక చెరువు వద్ద ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులను పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్లమెంట్లో అంబేద్కర్‌ను విమర్శించే స్థాయికి రాజకీయ నాయకులు దిగజారడాన్ని నిరసన వ్యక్తం చేశారు. బహుజన రాజ్యాధికారానికి యువత నడుం బిగించాలని కోరారు. కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ తెనాలి నియోజకవర్గ ఇన్చార్జి కారుమంచి సునీల్ సందీప్, అందే శ్యామ్, బొనిగల ప్రదీప్, సముద్రాల కన్నా, యనమద్రి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు తోపుడుబండ్లు

ప్రజాశక్తి - తుళ్లూరు

మండల పరిధిలోని రాయపూడిలో గురువారం 17 మంది చిరువ్యాపారులకు టిడిపి మండల అధ్యక్షులు జొన్నలగడ్డ కిరణ్‌కుమార్ తోపుడుబండ్లు ఉచితంగా అందజేశారు. మంత్రి లోకేష్ స్ఫూర్తితో వీటిని అందజేసినట్లు చెప్పారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

ప్రత్తిపాడు సర్కిల్ పోలీస్ స్టేషన్‌ను సౌత్‌జోన్ డీఎస్పీ భానోదయ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. క్రైమ్ రేట్ తగ్గిస్తామని చెప్పారు. సౌత్‌జోన్ డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రత్తిపాడు సర్కిల్ కార్యాలయాన్ని మొదటి సారి పరిశీలించిన ఆమె.. స్టేషన్‌లో సిబ్బంది, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ పాల్గొన్నారు.

పైప్‌లైన్ మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గుంటూరు

నగరంలోని 3 వంతెనల వద్ద 700ఎంఎం డయా సిఐ పైప్‌లైన్ మరమ్మతలను గడువుకంటే ముందుగానే పూర్తి చేయాడానికి ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. ఈ మేరకు పనులను ఆయన గురువారం పరిశీలించారు. పైప్‌లైన్ మరమ్మతు పనుల వల్ల నాజ్ సెంటర్ (ఎల్ఎల్ఆర్) రిజర్వాయర్ పరిధిలో పలు ప్రాంతాల్లో తాగు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతున్నట్లు చెప్పారు. రాత్రి సమయంలోనూ పని వేగంగా చేయ డానికి చేయడానికి తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలని చెప్పారు. పరిశీలనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డిఈఈ కళ్యాణరావు, ఏఈ మధు పాల్గొన్నారు.

ఉత్కంఠగా భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి - గుంటూరు

నరసరావుపేట జట్టుకు బహుమతిని అందిస్తున్న భాష్యం రామకృష్ణ

అపజయాల నుండి పాఠాలు నేర్చుకున్నప్పుడే విజయానికి మార్గం సుగమమవుతుందని భాష్యం విద్యా సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. భాష్యం విద్యాసంస్థల ఆధ్వర్యంలో భాష్యం రామసేతు క్యాంపస్ సమీపంలోని జెఎస్ఆర్ స్పోర్ట్స్ అకాడమీలో భాష్యం ప్రీమియర్ లీగ్ సెంట్రల్ లెవల్ టీ20 క్రికెట్ టోర్న మెంట్ బిపిఎల్ 2024-25లో భాగంగా జరుగుతున్న క్రికెట్ పోటీలు గురువారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఉదయం క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్లో నరసరావుపేట నింజాస్ జట్టు-గుంటూరు జెయింట్స్-3 జట్టు తలపడగా నరసరావుపేట నింజాస్ జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం వైజాగ్ వెలాసిటీ-3 జట్టు - గుంటూరు గ్లాడియేటర్స్-1 జట్టు తలపడగా వైజాగ్ వెలాసిటీ-3 జట్టు గెలుపొందింది. గెలిచిన జట్లుకు భాష్యం రామకష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ ఛైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.

9న చలమయ్య కాలేజి పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - గుంటూరు

స్థానిక సంగడిగుంటలోని గుంటూరు చలమయ్య కర్పూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఫిబ్రవరి 9వ తేదీన నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ కర్పూరపు రామకష్ణ ప్రభు తెలిపారు. గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం, సిల్వర్ జూబ్లీ వేడుకల పోస్టర్ ను రామకృష్ణ ప్రభు ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999 లో 9 మంది విద్యార్థులతో కళాశాలను స్థాపించటం జరిగిందని, దినదినాభివృద్ధి చెందుతూ కొన్ని వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నత స్థానాల్లో ఉండటం అభినందనీయమని అన్నారు. దాదాపు 3వేలమంది పూర్వ విద్యార్థులతో పూర్వ విద్యార్థుల సమ్మేళనం, సిల్వర్ జూబ్లీ వేడుకలు కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు, మెరిట్ విద్యార్థులకు పతకాలు బహుకరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల కమిటీ మెంబర్ కర్పూరపు సూర్యనారాయణ, ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, అధ్యాపకులు చంద్రశేఖర్, ఇందిరా భవాని, తదితరులు పాల్గొన్నారు.

మాచర్లలో సంక్రాంతికి వస్తున్నాం సందడి

ప్రజాశక్తి- మాచర్ల

మాట్లాడుతున్న సినిమా దర్శకుడు అనీల్ రావిపూడి

సంక్రాంతి బరిలో నిలిచి మంచి విజయాన్ని సొంతం చేసుకొన్న "సంక్రాంతికి వస్తున్నాం" సినిమా దర్శకుడు అనీల్ రావిపూడి మాచర్ల పట్టణంలో బుధవారం రాత్రి సందడి చేశారు. విక్టరీ వెంకటేష్ హీరోగా, ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరిలు హీరోయిన్లుగా నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఈనెల 14వ తేదీన ప్రేక్షకుల ముందుకొచ్చి పట్టణంలోని శ్రీనివాస మహల్‌లో విజయవంతంగా ప్రదర్శించబడుతుంది. సినిమా దర్శకుడు అనీల్ రావిపూడి దుర్గి మండలం ధర్మవరంలో జరుగుతున్న చిరుమామిళ్ళ సుబ్బదాసు ఆరాధన ఉత్సవాలకు వెళుతూ సినిమా ప్రదర్శించబడుతున్న శ్రీనివాసమహల్‌కు వచ్చారు. వీరికి సినిమాహాలు మేనేజర్ జాని, అభిమానులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రేక్షకులను ఉద్దేశించి అనీల్ మాట్లాడుతూ సినిమాను ఆదరించి మంచి హిట్ అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు. సినిమా చూడని వాళ్లకు సినిమా గురించి చెప్పి చూసే విధంగా చేయాలని కోరారు. తాను రచయితగా, డైరెక్టర్‌గా పనిచేసిన సిమాలన్నిటినీ ప్రేక్షకులు అదరించి తనను ప్రోత్సహించారన్నారు. ఇక ముందు కూడా ప్రేక్షకులను అలరించే మంచి సినిమాలు తీస్తానన్నారు. మాచర్ల వాసులు తనపట్ల చూపిన ప్రేమను ఎప్పటికి మరవనన్నారు. సినిమా మీకు నచ్చిందా.. అని ప్రేక్షకులను అడిగి తెలుసుకున్నారు. ప్రేక్షకుల రెస్పాన్స్ పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సినిమాథియేటర్ మేనేజర్ జానీ, పిన్నెల్లి మధు, చెన్నారెడ్డిలు డైరెక్టర్ అనీల్ రావిపూడిని ఘనంగా సత్కరించారు. సినిమా డైరెక్టర్ వస్తున్నాడని తెలుసుకున్న హీరో వెంకటేష్ అభిమానులు పెద్ద ఎత్తున సినిమాథియేటర్ వద్దకు వచ్చారు. పట్టణ సిఐ, ఎస్ఐలు పటిష్ట బందోబస్తు నిర్వహించారు.

దళితులు చనిపోతే పూడ్చడానికి స్థలమివ్వండి

వ్య.కా.స సర్వేలో దళితుల ఆవేదన - కనీస వసతులూ లేవంటూ సమస్యల ఏకరువు

ప్రజాశక్తి -కొల్లిపర

కొల్లిపరలో దళితవాడలో సర్వేలో మాట్లాడుతున్న ఈమని అప్పారావు

కొల్లిపర మండల కేంద్రంలో దళితవాడకు స్మశాన స్థలాన్ని కేటాయించాలని, డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కొల్లిపర దళితవాడలో వ్యకాస సర్వేలో కాలనీ వాసులు పలు సమస్యలు బృందం నాయకులకు తెలిపారు. దళితవాడలో మాల, మాదిగ సామాజిక తరగతి 2000 కుటుంబాలకు పైగా నివాసముంటు న్నామని, శ్మశాన స్థలం చాలక పోవడం వల్ల అనే ఇబ్బందులు గురవుతున్నామని, ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. శ్మశాన స్థలం కొనుగోలుకు శాంక్షన్ అయిందని చెప్తున్నారు తప్ప ఆచరణలో అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మెయిన్ బజార్ తప్ప అంతర్గత రోడ్డులలో డ్రైనేజీ వ్యవస్థ లేదని, పూడికతీతలు కూడా లేవన్నారు. దళితవాడలో 70 శాతం మంది కౌలు రైతులు ఉన్నారని వీరు ఎకరం నుండి మూడు ఎకరాల వరకు సాగు చేస్తున్నారని, వీరికి కౌలు కార్డులు గాని, రుణాలు గాని ఇవ్వటం లేదని తెలిపారు. 400 మంది భవననిర్మాణ పనులకు వెళ్తున్నామని భవన నిర్మాణ సంక్షేమ బోర్డు కార్డులు కూడా ఇవ్వలేదని ప్రమాదవశాత్తు ప్రమాదం జరిగితే ఎటువంటి నష్టపరిహారము రావటం లేదని తెలిపారు. ఉపాధి పనులను గ్రామంలో అగ్రవర్ణాలకు , బీసీలకు కేటాయించిన తర్వాత దళితులకు చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాది కూలి కూడా రూ.150 నుండి రూ.200 మాత్రమే రోజుకి పడుతుందని తెలిపారు. పరికరాలకు, పని ప్రదేశంలో కనీస వసతులకు డబ్బులు ఇవ్వటం లేదన్నారు.రేషన్ లో ఇచ్చే బియ్యం తినడానికి అనుకూలంగా లేవని నాసిరకం బియ్యం ఇస్తున్నారని, ధరలు పెరిగిన నేపథ్యంలో నిత్యవసర సరుకులు కూడా రేషన్ ద్వారా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్టీ, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను మంజూరు చేయడం లేదని దీనితో దళితవాడలు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. పాలకులు ఎన్నికల సమయంలోనే దళితులు పేద ప్రజలు గుర్తుకొస్తారని ఎన్నికల అనంతరం చాలా చిన్నచూపు చూస్తున్నారని విమర్శించారు. కౌలు రైతులను ఆదుకుంటున్నామని ఉపన్యాసాలు ఇస్తున్నారు తప్ప కనీస సౌకర్యాలు కల్పించడంలేదన్నారు.కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలని, ఉపాధి జాబ్‌చార్ట్ 150రోజులు సంవత్సరానికి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సర్వే కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎన్ భావన్నారాయణ, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మలకా శివసాంబిరెడ్డి, నాయకులు కోట చంద్రశేఖర్ నాయకులు దోప్పలపూడి రమేష్ ,జె.పవన్, పి .దిలీప్, పి. రవిచంద్రరావు పాల్గొన్నారు.

దళిత కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పెదనందిపాడు

తహశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న పాశం రామారావు తదితరులు

దళిత కాలనీల్లో సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని నాగులపాడు గ్రామ ఎస్సీ కాలనీలోని సమస్యల మీద మండల తహశీల్దార్ పి శంకర్ బాబుకు, ఎంపీడీవో గుంటి లక్ష్మీదేవికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పాశం రామారావు మాటాడారు. నాగులపాడు ఎస్సీ కాలనీలో సమస్యల మీద చేపట్టిన సర్వేలో గ్రామస్తులు పలు సమస్యలు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు ఎస్సీ స్మశాన వాటిక రోడ్డుకు పల్లంగా ఉండటంతో వర్షాకాలంలో మోకాళ్ళ లోతు నీళు నిలబడుతున్నాయని, మృతదేహాలు ఖననం చేయడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే శ్మశానంలో మెరక తోలించాలని, నీడకు షెడ్డు ఏర్పాటు చేసి, నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. స్మశాన వాటికకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని, రోడ్డు వెయ్యాలన్నారు. కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సుమారుగా 100 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని కోరారు. కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, వెంటనే బాగు చేయాలని కోరారు. గ్రామంలో వాడుక నీరు దుర్వాసన వస్తున్నాయని, నిరుపయోగంగా ఉన్న మైక్రో ఫిల్టర్ బాగు చేయించి, పరిశుభ్రమైన నీటిని అందించాలని కోరారు. ఉపాధి పనులను 200 రోజులు కల్పించి, కనీస వేతనం రూ.600 అమలు చేయాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా ఇవ్వాలని కోరారు. ఈ సమస్యల మీద ముందుగా మండల కేంద్రాలలో వినతి పత్రాలు అందజేస్తున్నామని తెలిపారు. జిల్లావ్యాప్తంగా సమస్యలపై కలెక్టర్ దృష్టికి తీసుకువెళదామని చెప్పారు. ప్రభుత్వం ఈ సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం సాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు దొప్పలపూడి రమేష్ బాబు, రైతు సంఘం నాయకులు కొత్త వెంకటశివరావు, జంపని రామారావు, నల్లమోతు రాజేంద్ర, ప్రజానాట్య మండలి నాయకులు దేవరకొండ శ్రీనివాసరావు, ప్రజా సంఘాల కార్యకర్తలు తలారి కిషోర్, తమలపాకుల ఆనందరావు, తమలపాకుల గాబ్రియేల్ తదితరులు పాల్గొన్నారు.

చిలువూరులో వ్య.కా.స బృందం సర్వే

ప్రజాశక్తి - దుగ్గిరాల

చిలువూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితుల ఆర్థిక పరిస్థితుల సర్వేలో పలు సమస్యలు వెలుగు చూశాయని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా జెట్టి బాలరాజు మాట్లాడుతూ ఉపాధి పనులు 100 రోజులు జరగడం లేదని, జరిగిన వాటికి సొమ్ము వెంటనే ఇవ్వడం లేదని నెలల పర్యంతం బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో దోమల సమస్యతో రోగాల బారిన పడే పరిస్థితి ఉందన్నారు. పంచాయతీ వారు దోమల మందు చల్లించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ ఫీజు రియింబర్స్‌మెంట్ అమలు కాక స్కూల్లో పిల్లల్ని యాజమాన్యం ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. ఉపాధి హామీ పనులు వంద రోజులు జరగలేదని ప్రస్తుతం పనులు లేక వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధి పనులు కల్పించాలన్నారు. రెండు నెలల క్రితం చేసిన పనులకు డబ్బులు ఇంతవరకు చెల్లించలేదని చెప్పారు. కార్యక్రమంలో జి బాలచంద్రుడు ఎన్ వెంకటేశ్వరరావు ఎన్ సాంబయ్య దావీదు అంకుల్ టి రామారావు ఎం అంజయ్య ఎన్ ఆదాం పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ కార్మికుల నుండి అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - గుంటూరు : నగరపాలక సంస్థలో పని చేసే కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిర్వహించే గ్రీవెన్స్‌కు అందే ఫిర్యాదులు, ఆర్జీలను అధిక ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని విభాగాధిపతులను కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో గ్రీవెన్స్ ద్వారా కార్మికుల నుండి అర్జీలు స్వీకరించారు. కార్మికులకు జీతాలు, అలవెన్స్‌లు, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలపై గ్రీవెన్స్‌లో నేరుగా తమ దృష్టికి తేవాలన్నారు. గాంధీ పార్కులో ఔట్ సోర్సింగ్ పద్ధతిపై విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులను టెండర్ ద్వారా పిలవాలని, అర్బన్ హెల్త్ సెంటర్ లలో అవుట్సోర్సింగ్ మహిళా మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్లకు నగరపాలక సంస్థ డిస్పెన్సరిలో విధులు కేటాయించాలని, ఔట్ సోర్సింగ్ హెల్త్ అసిస్టెంట్లకు ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్లుగా విధులు కేటాయించాలని ఎపి మున్సిపల్ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు మధుబాబు కోరారు. యుజిడి కార్మికుల పెండింగ్ అలవెన్స్‌లను మంజూరు చేయాలని యాకోబు కోరారు. కార్యక్రమంలో సిఎంఒహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, విభాగ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

నేడు రాజధానిలో మంత్రి నారాయణ పర్యటన

ప్రజాశక్తి - తుళ్లూరు

మున్సిపల్ శాఖా మంత్రి పి నారాయణ శుక్రవారం రాజధాని అమరావతిలో పర్యటించనున్నారు. ఉదయం 8.30 గంటలకు రాయపూడి వద్ద నిర్మిస్తున్న సి ఆర్‌డిఎ కార్యాలయం వద్దకు మంత్రి చేరుకుంటారు. అనంతరం 9 గంటలకు నేల పాడుకు చేరుకుని అక్కడ జరుగుతున్న వివిధ అభివద్ధి పనులను పరిశీలిస్తారని మంత్రి కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది.